జ్వలితజ్వాల

'ఉషశ్రీ'

లీలావతి కూర్చున్న కుర్చీ కెదురుగా గోడమీద వ్రేలాడుతూన్న రెండు ఫోటోల్లో ఒకటి ఆమెను చూసి జాలిపడుతున్నట్టూ, రెండోది హేళన చేస్తూన్నట్టూ ఆమెకు గోచరిస్తున్నాయి.

లీలావతి చేతులు గజగజలాడుతున్నవి.

లీలావతి చేతిలోని ఉత్తరం రెపరెపలాడుతున్నది.

ఆమెశరీరం ఆపాదమస్తకం కంపించిపోతున్నది.

మనసులో ఏవో బాధలు రేగి గుండెలోని తూట్లను వెలికి కలచివేస్తున్నవి.

చేతిలోని ఉత్తరాన్ని అతి ప్రయత్నంమీద నిలిపి పట్టుకుని చూడసాగింది.

ఆమె కన్నులు ఉత్తరంలోని అక్షరాలను గుర్తుపట్టలేకపోతున్నవి.

విచారాన్ని గొంతులో ప్రాడ్చి, కనుగొలుకుల్లో నొక్కిపట్టి ఉత్తరంలోకి దృష్టి పోనిచ్చింది.

*　　*　　*　　*

నాన్నగారికి!

నమస్కారాలు—ఈ పాడులోకంనుంచి నాకు విముక్తి లభించి పైలోకాలకు పోవటానికి తగిన కృషి చేస్తూన్న ఈ సమయంలో నా అంతిమ కర్తవ్యాన్ని నిర్వర్తించటానికి ఈ ఉత్తరం వ్రాస్తున్నాను.

భూగోళంలోని మానవుడు అనుభవించగలిగినన్ని భోగాలూ రుచిచూశాను; భరించలేని బాధల్నీ సహించాను. నన్ను ఇంతటి నీచుణ్ణిగా తయారుచేసిన మీగుండెలో చిచ్చు రగిలించటమే నా ఆఖరు లక్ష్యం.

నాకు జ్ఞానం వచ్చింది మొదలు మీరు నామీద ఎంతమాత్రం శ్రద్ధవహించలేదు; ఏ విధమయిన బాధ్యతా తీసికోలేదు. మీకొక కొడుకు ఉన్నట్లూ—వాడు మీరక్షణలో పెరిగి, పెద్దవాడు కావలసినట్లూ, వాడి భవిష్యత్తును దిద్ది తీర్చవలసిన భారం మీదే ననీ ఏఒక్కనాడూ మీరు భావించలేదు. మీ మనసులో —ఏక్షణంలో—అటువంటి బుద్ధిపుట్టినా నే నింతటి దౌర్భాగ్యుణ్ణయ్యేవాణ్ణి కాను.

కాను కానీ...అయినందుకు ఇప్పుడు నాకేం విచారంలేదు. ఫలానా వెంకట్రాయుడుచౌదరికొడుకు ఇంత వెధవ అయాడని లోకం ఘోషిస్తుంటే మీ బి. యల్. పట్టా మీకు శాంతినివ్వగలదా; మీరావు సాహెబ్ బిరుదు మిమ్మల్ని ఓదార్చగలదా; మీస్థితిగతుల్ని చూసి చుట్టూ చేరే బాజమ్మలు ఒక్కరేనా ఈఅపవాదునుండి కాపాడగలరా? ఆలోచించండి...

అసలు నేనేం చేశానని నన్నింతటి అధోగతి పాలు చేశారు? దేశంలో పేరుప్రతిష్ఠలు సాధించుకున్న వెంకట్రాయుడు చౌదరి కొడుకు జారుడూ, చోరుడూ అయి చివరకొక హంతకుడు కూడా అయాడని లోకానికి తెలిసినప్పుడు కూడా మీరు గంభీర మౌనముద్రతో బ్రతికగలరా!—అసంభవం.

ఆ మరుక్షణంలో మీ గుండె కుతకుతలాడి క్రుళ్ళటం ఆరంభిస్తుంది. పటపట పళ్లుకొరుక్కుని, గుండెలో గిజగిజలాడితే ఏం ప్రయోజనం స్వామీ -

నాకు బాగా జ్ఞాపకం—

తన, మన భేదం తెలుస్తున్నది మొదలు మీరు నన్నెప్పుడూ దగ్గరకు చేరనివ్వలేదు. నా కోసం ప్రత్యేకించి రెండుగదులతో డాబా వేయించారు. అక్కడే నా అవసరాలు తీరుతూండేవి. అక్కడికే ప్రైవేటు మేష్టారు వచ్చేవాడు. హైస్కూలు చదువు ప్రారంభించేవరకూ ఏ అల్లరిచేసినా అది కుర్రతనంగా పోయింది. అక్కడనుంచి మేష్టారితో నేను పేకా, కేరమ్స్ పందెం వేసి ఆడుతున్నానని మీకు తెలిసినా మీరు ఏమీ ఎరగనట్టే ఊరుకున్నారు. నేను

స్కూలు ఎగేస్తున్నాననీ, చదువులో చవటనవుతున్నాననీ ఫిర్యాదులు వచ్చినా మీరు ఖాతరు చెయ్యలేదు. రెండుమూడుసార్లు అమ్మకూడా మీ అశ్రద్ధను చూసి ఏడుస్తూ నన్ను మందలించింది—"

ఇంతవరకూ బిగబట్టిన దుఃఖం చీల్చుకువచ్చింది, లీలావతికి. ఆమె కన్నులనుండి ధారాపాతంగా కన్నీరు ప్రవహిస్తున్నది. చెంగుతో కన్నీరు ఒత్తుకుని చదవసాగింది.

"...మీమీద ఉండే గౌరవంవల్ల కావొచ్చు, —నా సాహసకార్యాలకు భయపడి అయినా అవొచ్చు—నన్ను స్కూల్ ఫైనల్ వరకూ—పరీక్షలకు రాకపోయినా — ఫెయిల్ చేసే దమ్ములేక పోయింది, వారికి.

అదిమొదలు నా దురభ్యాసాలకు అంతులేకుండా పోయింది మాంచి ప్రాక్టీసు ఉన్న అడ్వొకేట్ కొడుకునీ, నగరంలో సంపన్నుడయిన రాయుడు చౌదరి మనవణ్ణీ అయాక నాకు విలాసాలకూ, వినోదాలకూ అడ్డేమిటి? నామీద మీరు ఏవిధమయిన చర్య తీసికోనప్పుడు...ఇంకా ఆలోచించాలా.

ఆ రోజుల్లో...

మనయింటి దాసీదాని మనవరాల్ని నేను బలవంతంగా గదిలోకి లాక్కుపోయి అనుభవించటం మీ రెరుగుదురు. ఎరిగిఉండీ నన్నేమీ అనకుండా కొన్ని వందలరూపాయలతో దానినోరు కట్టేసి ఊరు నుంచి పంపేశారు. అంతటితో నాజీవితం పూర్తిగా జారిపోయింది. అంతవరకూ—కాదు—ఇప్పటికీ - నాకు మీరంటే భయమే భయంతప్ప మరోభావం మీమీద నాకెన్నడూ కలగలేదు; ఇంక కలగనక్కర్లేదు.

ఆ భయంలో కూడా మీరు నన్నేమీ చెయ్యలేరనే ధీమా కూడా ఉంది. ఆ సంఘటన తరువాయి నేను పూర్తిగా మారిపోయాను. ఒకోక్కరోజు రాత్రి మూడుగంటలవేళ ఒళ్లు తెలీని మత్తులో కారుదిగి మేడమెట్లు ఎక్కుతుండగా—నాకోసం కళ్లల్లో ఒత్తులు వేసుకు కూర్చున్న — అమ్మను కౌగిలించుకున్న మూర్ఖుణ్ణి......"

వణుకుతూన్న చేతుల్లో ఉన్న ఉత్తరాన్ని పట్టుకోలేక పోయింది, లీలావతి.

"చిట్టీ!—"

అని వెర్రికేక వేసి, కుర్చీలో వెనక్కు వ్రాలింది. వెక్కి, వెక్కి ఏడిచింది.

"ఇంతకన్న తుచ్ఛుడుంటాడా — అందుకే తగినశిక్షను అనుభవిస్తున్నాను. 'పశ్చాత్తాపంతో హృదయాన్ని క్షాళన చేసికోవటంకంటె ప్రాయశ్చిత్తం వేరేలేదు' అన్నాడు, బదరీనారాయణంలో కనిపించిన సాధువు. ఆ వాక్యంలోని బలం, దాని సత్యం ఇప్పుడు అర్థమవుతున్నవి.

నాలానే మీరూ ఈబాధను అనుభవించి తీరాలి. మీవల్లనే నేనింతటి దౌర్భాగ్యుణ్ణి అయానని తెలుసుకుని, పశ్చాత్తాప పంచాగ్నిజ్వాలామధ్యంలో మీ హృదయం మాడుతూంటే నబాధ కొంతయినా తగ్గుతుంది.

మీరు కూర్చునే పడకకుర్చీ కెదురుగా ఉన్న గోడమీది నటరాజరాజేశ్వరుని పాలరాతివిగ్రహం వైపు చూస్తూ, గుండెలమీద చేతులుంచుకుని చెప్పండి:

మన పక్కవీధిలో ఉన్న ప్లీడరు సుబ్బారావు మనవరాలు సుహాసిని మన ఇంటికి వచ్చినప్పుడు, నాగది గడపలోంచి కదులుతూండగా దాన్ని నేను లోపలకు లాగుతూండగా మీరు చూశారు. చూసీ చూడనట్లు వెళ్లిపోయారు. పురుషస్పర్శ అంటే ఏమిటో తెలీని ఆయావనవతి నానుండి తాత్కాలికంగా ఏదో సుఖాన్ని పొందింది. పొందినా దాని జీవితం ముందు ముందు ఎలా మారుతుందో ఊహించారా? రెండేళ్ల క్రితం కాబోలు అది అలహాబాదులో అవుపించింది. నేను గుర్తుపట్టలేకపోయాను; అదేపిలిచి తనభర్తకు పరిచయంచేసింది. ఆవెధవదాని మొగుడని తెలవగానే నాకు వెర్రెత్తింది. నశిరోద్ధుమీద వాణ్ణి పొడిచేసి దాన్ని తీసికెడదామనుకున్నాను. కానీ, నాలోని ఏ దౌర్బల్యమో నన్ను నొక్కేసింది; అది మళ్ళీ కనిపించకపోతుందా అనుకున్నాను. రెండు, మూడుసార్లు కలకత్తాలో వాడు తారసపడ్డాడు. కాని...అయితే ఆపెళ్లి తమ చేతిమీదుగానే జరిగించారట.

ప్రపంచజ్ఞానాన్ని కలిగించటానికి ఉపయోగపడని వెధవడిగ్రీలు రెండు, మూడున్నంతలో వాడు పెళ్లికి అర్హుడా? ఓ నలభైఎకరాల ఆస్తీ, అయిదారు లక్షలు నిలవా ఉన్నంతలో వాడు సుహాసినిలాంటి

స్త్రీకి భర్త కాగలడా? జీవితం అంటే డిగ్రీలూ, అస్తులేనా? — చెప్పండి—అలా అనుకునే నన్ను ఇలా చేశారా; అలానే మీరు రావుసాహెబ్ బిరుదం సాధించివట్టున్నారు.

సుహాసినినీ — నన్నూ ఆ రాత్రి వదిలినట్లే పూర్తిగా విడిచేస్తే మేమిద్దరం చిలకా—గోరింకల్లా ఉండేవాళ్ళం కాదూ; అప్పుడు నాజీవితం యింత ఛండాలంగా ఉండేదా? అలా మమ్మల్నిద్దర్నీ వదిలేస్తే నేనెంత మంచివాణ్ణిగా మారేవాడినో ఊహిస్తారా?

బ్రతికుండగా దాన్ని కుంభీపాక నరకంలోకి త్రోసేశారు; నన్ను నందనవనంలోకి పంపించారు.

నిజం—

ఆరాత్రే—మీరు బజారునుంచి పదింటికి తిరిగి వస్తూనే, నా గదిలోకి వచ్చి వందరూపాయలనోట్ల కట్టలు నాముందు పెట్టి, 'తెల్లవారేసరికి ఈ రాష్ట్రపు సరిహద్దులు దాటిపో' అన్నారు.

తాగుడుకీ, ముండలకీ అలవాటుపడ్డ నాకళ్ళ ముందు పదిహేను వేల రూపాయలతో స్వేచ్ఛాలక్ష్మి వచ్చి నిలబడి వరిస్తుంటే, పద్ధెనిమిదేళ్ళ యౌవన మదంలో ఉన్న నేను తిరస్కరించగలనా—తత్క్షణం —అమ్మతో కూడా చెప్పకుండా — రైలుకు బయల్దేరాను.

అనంతరం ...

నాలుగేళ్ళు గడిచాయి....

ఈనాడు ఈ ఉత్తరం రూపంలో నా ఆఖరు శ్వాసను అగ్నిహోత్రంలా మీమీదకు పంపుతున్నాను.

సందేహం లేదు......

ఈరోజుకు తప్పించుకోగలిగినా వారంరోజుల్లో అయినా నేను పోలీసులచేతుల్లో ఉంటాను; కోర్టులో నన్ను నిలబెట్టి, మీవంటి మరొకలాయరు నన్ను దోషిగా నిరూపిస్తే, ఉరిశిక్ష నాకు ప్రసాదిస్తారు. హత్యానేరం ఋజువయితే మరొకశిక్ష లభించడం సాధ్యం కాదు.

ఆశిక్షను నేను చిరునవ్వుతో స్వీకరిస్తాను. ఈ ఉత్తరం మీరు చదువుతూన్నప్పుడు నా అంతరాత్మ పొందే ఆనందం......

అమ్మా!......"

లీలావతి పాదాలమీది ఉత్తరంలోని ప్రతి వాక్యం ఆమె హృదయాన్ని ప్రేలుతూన్న అగ్నిపర్వతం మధ్యకు విసురుతున్నది; ఆమెకన్నులలో నీరు ఇంకిపోయింది.

* * * *

"అమ్మా!

ఈ ప్రపంచంలో నన్నెందుకు పారేశావు. నేను చేసిన పాపాలన్నీ ఒకయెత్తూ, నిన్ను ఏడిపించిందొక యెత్తూనూ. ఒకవేళ నిజంగా నరకమనేదే ఉంటే— అది ఉండితీరుతుంది—ఉండకపోతే నాలాంటి జీవుల పాపానికి నిష్కృతి లేదు—అక్కడ నేను తలవాల్చి యమధర్మరాజుని ఇదే కోరుతాను:

"మహాప్రభూ! ధర్మమూర్తీ!

ఈ పాపిచేసిన పాపాలన్నిటికీ భూలోకంలోనే శిక్ష లభించింది. ఈలోకంలో నేను ఉండవలసినంతకాలం అమ్మను ఏడిపించిన మహాపాతకానికే శిక్షను ప్రసాదించు.

నవమాసాలూ మోసి, నానాయాతనలూ పడి కని పెంచిన కన్నతల్లి ఋణాన్ని తీర్చుకోగలవాడు లేడు. లేకపోగా, పన్నెండేళ్ళు వచ్చేవరకూ భూమిమీద కాలు మోపనివ్వకుండా, పొత్తిళ్లలో — చేతుల్లో పెంచిన ఆమాతృదేవి హృదయంలో ఆరనిచిచ్చు రగుల్కొలిపిన మహాపాపిని. నేపాడింది పాటగా, ఆడింది ఆటగా సాగనిచ్చిన అమ్మగుండెలో గుండు సూదులు గుచ్చినందుకు అనుభవించవలసిన శిక్షను నిర్దాక్షిణ్యంగా విధించు.' ఇదే నేను వరంగా యాచిస్తాను......"

లీలావతి హృదయం ఛిన్నాభిన్నమయిపోయింది. ఆమె కన్నుల్లో దైన్యం మూర్తీభవించింది. శరీరంలోని ప్రతిఅవయవం మహాబాధతో సంకోచిస్తున్నది.

"అమ్మా!

ఈ పసివాడి అంతిమ వందనాలు అందుకో అమ్మా.

అమ్మా! ఒక్క వాగ్దానం చేస్తున్నాను. ఆయన నాకెంత అన్యాయం చేసినా నీమీద నాకుండే ప్రేమ కొద్దీ, ఏసమయంలో అయినాసరే నేను నాతండ్రి పేరు చెప్పను. నీకోసం — అమ్మా! — నీకోసం ఆయనగౌరవాన్ని పాడుచెయ్యను......"

లీలావతి స్మృతిరహితస్థితిలోకి వచ్చింది. కాలి మీది పైఉత్తరం గాలికెగిరి పడిపోయింది. గోడ మీది ఫొటోల్లో ఒకదానిమీద సాలీడు గూడుకడుతూన్నది.

2

నాకు తెలుసు లీలావతీ—

నాకే కాదు—నీకూ తెలుసు లీలా—

క్షమించండి, లీలావతీదేవిగారూ; పాపం! నీకొడుక్కింకా కుర్రతనం పోలేదు.

వాడు ఏ దుర్ముహూర్తంలో నీ గర్భంలో పడ్డాడో నాటినుంచీ నీకు శాంతి లేదు; సుఖం లేదు.

వాడి ఉత్తరం నన్ను నాడ్చి, మసిచేస్తుందనుకున్నాడే కాని ఆ ఉత్తరం నిన్నే మలమలలాడించి, విలవిలలాడిస్తుందనుకోలేదు. నిజం లీలావతీ! మనకు ఎదుటివాళ్లమీద ఎంత ప్రేమా--అభిమానంఉంటాయో వాళ్ళను అంతకంతా బాధిస్తాము — ఆ విషయం బాధించేవాళ్లకు తెలీదు—తెలీకుండానే హింసిస్తారు. అలానే నీ ముద్దులబిడ్డకు నీకు తెలీని వెన్నో విప్పిచెప్పి నీలో నిండుకుంటూ ఉన్న శాంతిని ఛిన్నాభిన్నం చేశాడు; నీగుండెలో మళ్లీ చిచ్చు ముట్టించాడు.

ఏదో ఒకరోజున ఇటువంటి ఉత్తరం వస్తుందని నేననుకోలేదు కానీ ఈదృశమయిన సంఘటనలో నీకొడుకు చిక్కుకుని తీరతాడని నాకు తెలుసు. ఆ చిక్కులో అంతర్వ్యథతో, మహావేదనలో పశ్చాత్తాప పడతాడనీ నాకు తెలుసు.

అటువంటిది నీకు తెలీకపోతే నువ్వు ఎంతో ప్రశాంతంగా జీవితాధ్యాయాన్ని ముగిస్తావనుకున్నాను. నీ నుదుట ఆ అదృష్టంకూడా లేకుండా చేశాడు, వాడు.

లీలా! నిన్ను చూస్తే నాకు జాలీ, అసహ్యమూ కలుగుతాయి. ఒక్కగాను ఒక్కకొడుకును కని నువ్వు ఏమాత్రం సుఖాన్నీ అనుభవించలేకపోయావు. నీతోపాటు నేనూ ఆ వేదన అనుభవించాను.

రావుసాహెబ్ వెంకట్రాయుడుచౌదరి ఇంతటి కీర్తి—ప్రతిష్ఠల నెలా ఆర్జించాడో తెలుసా?

తెలుసు ననుకుంటావు నువ్వు.

నువ్వు కాలుపెట్టిన వేళావిశేషం మంచిదని నలుగురూ అంటూంటే ఉబ్బి, తబ్బిబ్బయి పోయేదానివి; ఒకవిధంగా అది సత్యమే కావొచ్చు.

నువ్వు వచ్చిన వేళావిశేషమో, నువ్వు పాదం ఉంచిన శుభక్షణమో నాకీర్తి ప్రతిష్ఠలకు కారణం అని అంటే అంగీకరించటానికి నాకు అభ్యంతరం లేదు.

నువ్వు ఈయింటికి వచ్చిన దగ్గర్నించీ—కాదు —నిన్ను పెళ్ళాడిన నాటినుంచీ నాకు చదవటం, తిరగటం పనయిపోయింది. నిన్ను కాపరానికి తీసికొచ్చిన మొదటిరోజుల్లో కూడా నేను రాత్రి పదీ, పన్నెండూ దాటేవరకూ వచ్చేవాణ్ణే కాదు. వచ్చినా ఏదో ఎమర్జెన్సీ కేసుగురించి పుస్తకాలు తిరిగేస్తున్నట్టే ఉండేవాడిని; ఏప్రధానవిషయం మీదనో అనుమానం వచ్చి బృహద్గ్రంథాలు పరిశీలించేవాడిని.

నిజానికి ఆరోజుల్లో నాకంతటి ప్రాక్టీసూ లేదు; పనీ లేదు. లేకపోయినా ఆ అలవాటు తప్పిందికాదు; తప్పకపోగా అనంతరం అది అనివార్యం అయింది. ఇవంతా నాకు నీతో మాట్లాట్టానికి కూడా తీరిక లేకుండా చేసింది. పైగా ఆరోజుల్లోనే నేను చదరంగం అభ్యాసం చేస్తున్నానేమో, మరీ తీరిక చిక్కేదికాదు.

నేను కోర్టునుంచి వస్తూనే సరాసరి లక్ష్మీనారాయణశాస్త్రిగారినో, నరసింహమూర్తినో తీసికొచ్చేవాడిని. నరసింహమూర్తికి చదరంగం బల్ల కనిపిస్తే 'మహారాజయోగం' పట్టబోతున్నా ఒక ఘడియ ఆగమంటాడు; శాస్త్రిగారు కూడా అంతకు తీసిపోరు.

నీకు తెలిసిన ఈ విషయాలుచెప్పి నిన్ను విసిగించనులే, ఒకందుకు నిన్నభినందించక తప్పదేమో లీలా! ఈ గడపలో అడుగుపెట్టింది మొదలు గతించిన రెండుదశలలో నువ్వు సాంసారికసుఖం అనుభవించకపోయినా అది మూడోకంటివాడికి తెలీనివ్వలేదు. నేనెంత గంభీరంగా ఉండేవాడినో నువ్వూ అంత కలకల్లాడుతూనే ఉండేదానివి.

నాహృదయంలో ఏ హాలాహలం రగులుకుని పొగలు సెగలు చిమ్ముతున్నదో నీహృదయంలోనూ అదే వ్యథ రాజుకుంటూన్నదని నాకు తెలుసు.

ఈరోజున చెప్తున్నాను లీలా! ఈరోజునా చెప్పేవాణ్ణి కాను; కానుకానీ ఇంకా ఈ విష

యాన్ని యిలానే ఉంచి నీ అజ్ఞాత వేదనను తగ్గించక పోవటం నా కిష్టం లేదు; లేదు కనకనే వివరిస్తున్నాను—విను.

నీకొడుకు భావించినట్టు — నువ్వు పశ్చాత్తాపంతో కుమిలి, కుళ్ళి నశించాలని నేను కోరటం లేదు. నీపాపానికి ప్రాయశ్చిత్తంగా నీ హృదయంలో భోగిమంటలు రగిలించటం నా అభిమతం కాదు.

రావుసాహెబ్ వెంకట్రాయుడు చౌదరి ఇంత గౌరవనీయజీవితాన్ని సాధించుకోవటానికి—నిజంగా — కారణం నువ్వు లీలావతీ! నిన్ను కాక నేను మరెవర్ని పెళ్ళాడినా సాంసారిక సుఖా లనుభవిస్తూ, అందరిలానే పిల్లల్ని కని, వాళ్ళకోసం ఆస్తికూడబెట్టి, నేను చస్తే ఈ ఆస్తినంతనూ వీళ్లు ఏంతగలేస్తారో అని ఏడుస్తూ ఉండేవాడిని.

అటువంటి ప్రమాదంనుంచి నన్ను రక్షించిన నీకు జోహార్లర్పిస్తాను.

* * * *

ఎరుగుదువు లీలావతీ—

నువ్వేకాదు,— నేనూ ఎరుగుదును.

ఎరుగుదును కానీ నాకీ విషయం తెలిసినట్టు నీకు తెలీకపోవటంవల్లనే తృప్తిగా కాలం గడిపావు. తెలియజెప్పలేదు కనకనే నా ఆత్మగౌరవశ్రీ చెక్కుచెదర లేదు.

ఒక్క విషయాన్ని—

విషసదృశవిషయాన్ని నా కంఠంలో కాలకూటంలా దాచుకోవటంవల్లనే ఇంత జరిగి, మన దాంపత్యం ఆదర్శంగా అందరినీ భ్రమింపజేసింది.

మరిచిపోలేను లీలా నేను—నువ్వూ మరిచిపోలేవు—ఆరోజు సాయంకాలం కాలేజీనుంచి వచ్చేసరికి మా వసారాలో ఒక సౌందర్యలహరి స్థిరసౌదామినివలె కూర్చుని ఉన్నది. ఆ లహరిని చూచి ఒక్క క్షణం నా మనసు ఊగిసలాడిపోయింది. ఆ సమయంలో ఆ సౌదామిని ప్రక్కనే కారుమేఘంవంటి పురుషుడొక డున్నట్లు నాకు తెలీదు. తెలిసిఉంటే నేనంత అచేతనంగా నిలబడి పిచ్చిగా నీవైపు చూడలేకపోయేవాణ్ణి.

అప్పుడు నిన్నూ, మీమావయ్యనూ మా నౌఖరు అప్పన్న ఎరుకపరిచాడు. ఆక్షణంలో మీ మావయ్యతోపాటు నీ సౌందర్యానికి కూడా నేను అంజలులర్పించాను. మీ రెందుకొచ్చారో నాకు తెలీకపోయినా, నేను ఏమనుకున్నానో అదే అయింది. తొలిచూపులోనే నా సర్వస్వం నీకు అంకితం అయిపోయింది. అంతవరకూ 'ఆడది' అంటే అసహ్యపడే వెంకట్రాయుడు ఆక్షణంలో తనహృదయాన్ని నీచేతుల్లో ఉంచటానికి సిద్ధపడ్డాడంటే నమ్మగలవా?

మీ మావయ్య మాంచివ్యవహర్త—ఉత్తివ్యవహర్తపదం నా ఊహను సరిగా వ్యక్తం చెయ్యలేదు— ఎదుటివారి కన్నుల్లోంచి ఇంగితాన్ని పసిగట్టగలడు. ఆయన నన్ను సర్వతోముఖ వ్యూహంలోకి నడిపించే ప్రయత్నంలో పడ్డాడు.

నేనే కాదు లీలా—అనేకులు నీ సౌందర్య, లావణ్యాలకు సమ్మోహితులవుతారు. సుదర్శనాల్లాంటి నీ కనుపాపలు, చిరునవ్వులో సొట్టలుపడే నీబుగ్గలు శ్రీశుకుల ముకుపుటాలకయినా త్రాళ్ళు పోసేయగలవు.

* * * *

నీకు జ్ఞాపకం ఉండి ఉంటుంది:

నువ్వు కాపరానికొచ్చింది ప్రారంభం ఏ ఆరుమాసాలకో, సంవత్సరానికో ఓమారు మన మేడవెనుకదొడ్లో పూలమొక్కలమధ్య సోఫాలో కూర్చుని కబురుచేసేవాణ్ణి. అలాటి సన్నివేశాలలో సోఫాకి చెరోచివరా ఇద్దరం కూర్చునేవాళ్లం. నేను మౌనంగా నీకన్నుల్లోకి పిచ్చివాడిలా చూస్తూ కాలంగడిపాను. అటువంటి సమయాల్లో నువ్వు ముందుగా నవ్వేదానివి; సొట్టలుపడే నీబుగ్గలు నన్ను కవ్వించేవి. నీకన్నులు నా హృదయంలో పురాస్మృతులను కెలికి, గిలిగింతలు పెట్టేవి. అయినా నా గభీరప్రశాంతత చలించేదికాదు. దౌర్బల్యంతో నువ్వు నాదగ్గరగా జరిగేదానివి. రెండు, మూడుసార్లు కౌగిలించుకోనేందుకుకూడా ప్రయత్నించేదానివి...అంతే... అప్పుడు నీ అంతరాలలో నా కెన్ని శాపా లుదయించేవో తెలిసికోగలను.

నీ కన్నుల్లో అంత కైపెక్కించే అతీతశక్తి, సౌందర్యం లేకపోతే నువ్వు నా యిల్లాలివి కాలేకపోయేదానివి; గ్రహబలంవల్ల అయినా ఇంతకాలం ఈ యింట్లో ఉండనిచ్చేవాణ్ణి కాదు, లీలా...

* * * *

ఆ రోజున...

మీ మావయ్య నిన్ను ఎదుట పెట్టి వ్యవహారం నడిపించాడు. నాకు నేనే సర్వాధికారిని కావటంవల్ల నా అనే ఆత్మీయులెవరూ నాకు లేకపోవటంవల్లా, నా అభిమతం నిన్ను వరించటంవల్ల నేను నీ పాణిగ్రహణం చేయటానికి సమ్మతించాను; అదే నిమిషంలో మీ మావయ్య మనిద్దరి చేతులూ కలిపేశాడు. ఆ కరస్పర్శలో ఎంత పులకించాను!

వరూధిని ఒంటరిగా రాక ఇంకొక్క చెలికత్తెను అడ్డం వేసికొని వ్యవహారం సాగిస్తే కుహనా ప్రవరుడు వచ్చేవాడు కాడు; కాని లీలా......ఆ క్షణంలో వరూధినిలాగే నువ్వు కనిపించావు నాకు.

అచిరకాలంలో...కాదు....అదే రాత్రి... ఆ రాత్రే...నాకు జన్మజన్మాల స్వర్గసుఖాన్ని ప్రసాదించావు లీలా...

గోడ గడియారం తొమ్మిది గంటలు కొట్టింది.

అంతవరకూ ఏదో పిచ్చాపాటీ చెప్పుకుపోతున్న మీ మావయ్య అంతలో లేచి చుట్ట ముట్టించి 'దశావతారాలు చూడాలి, వస్తారా?' అన్నాడు. నాకు నవ్వు వచ్చింది; నాకసలు సినిమాలపిచ్చి లేదు. అందులోనూ సినిమా చూడాలంటే నాకు చాలా విషయాలు కుదరాలి. అందుచేత నేను రానన్నాను. నువ్వు కూడా 'రాను' అనాలని అనుకున్నాను, అనుకోవటమే కాదు—అంటావని నమ్మాను...నమ్మినట్లే నువ్వూ అనేశావు; అనేసరికి నా గుండె దడదడలాడింది; నా మనస్సు కులికింది. మీ మావయ్య ఏమంటాడో, ఏమనుకుంటాడో అని అనుమానించాను కానీ ఆయన అనకుండా, అనుకోకుండా వెళ్ళిపోయాడు.

మనిద్దరం మిగిలిపోయాం—మా నౌఖరప్పటికే వీధి గదిలో గుర్రుకొడుతున్నాడు. కొంతసేపు నిశ్శబ్దంగా గడిపాం. ప్రసంగం ఎలా ప్రారంభించాలో అర్థంకాక తికమకపడుతూన్న నన్ను మా కాలేజీ విషయాలడిగి భయంకరమైన నిశ్శబ్దాన్ని నీమృదుభాషణలతో ఛేదించావు. అలా గంట, గంటన్నర గడిచాక నువ్వు ఆవులింతలారంభించావు. చేతికందిన స్వర్గం జారిపోతూన్నదని భయపడ్డాను. కానీ—నీ ఆవులింతలు అభినయమని ఆ విధానం తెలిపింది.

కవ్వించే చిరునవ్వులో తెచ్చిపెట్టుకుని ఆవులిస్తూ, చిటికలు వేస్తూంటే అది అభినయం కాదని ఎలా అనుకోను. అయినా అప్పుడు నువ్వు అలా ప్రవర్తించటం నన్ను ఎంతో ఆకర్షించింది. నాలో ప్రకోపిస్తూన్న ఉత్కృష్టమయిన ఆకాంక్షను లాలించి, రెచ్చగొట్టింది.

'మీరు మేడమీది గదిలో పడుకోండి'

అన్నాను.

'ఫరవాలేదు. ఏదయినా చెప్పండి, మీకు కూడా నిద్రొచ్చేవరకూ ఉంటాను' అన్నావు.

అంటూనే ఆవులిస్తూ పైట జార్చేశావు. ఉబికి, ఉబికించే నీ సౌందర్య దర్శనంతో నన్ను ఉన్మత్తుణ్ణి చేయటానికి చేయగలిగినంత కృషి చేశావు.

ప్రశాంతమయిన వాతావరణం!

ఏకాంతం! మూర్తీభవించిన లావణ్యలహరి!

ఇరవై వసంతాల యౌవనంలో ఉన్న నన్ను రెచ్చగొట్టటంలో ఆశ్చర్యమేమిటి? అయినా మరికొంతసేపు ఏదో మాట్లాడుకున్నాం. మాట్లాడుతున్నంతసేపూ నా దృష్టి ఏ అజ్ఞాతమయిన అనుభూతులకో సమోపరితపిస్తూనే ఉంది; అననుభూతవాంఛ నన్ను గిలిగిలిస్తున్నది. నువ్వు నెమ్మదిగా లేచావు...

నీకు పడకగది చూపించే నెపంతో నేనూ లేచి అడుగులు వేశాను.

అంతలో నా భుజంమీద నువ్వు చెయ్యి వేశావు; మెత్తని, వెచ్చని నీ శరీరస్పర్శతో నా శరీరంలో చల్లని విద్యుత్తు ఉద్భవించి, వెచ్చబడింది; ఆ తలంపే నేటికీ నన్ను కులికిస్తుంది లీలా!

మేడకున్న పదహారు మెట్లూ స్వర్గసోపానాల్లా ఉన్నాయి. ఎలానో పడకగదిలో మంచందగ్గరకు తీసికొనివెళ్ళేసరికి నీకు నిద్ర క్రమ్ముకొచ్చేసింది. ఆ మైకంలో నా చేతిని వదలలేక నన్నుకూడా మంచం మీదికి లాగేశావు. సరిగ్గా మంచానికి దగ్గరే ఉన్న స్విచ్ మీదకు నీ ఎడంకాలు పాములా పాకేసింది.

గదంతా చీకటి...

ఆ చీకటిలో రోహిణీ — శుక్రతారలులా నీ కన్నులు మెరుస్తున్నాయి; అంతలో అస్తమిస్తు

న్నాయి...ఈనాటి దీవన్నీ స్మృతిలో....లీలా..." అని పకాల్న నవ్వాడు. రావుసాహెబ్ వెంకట్రాయుడు చౌదరి.

అంతవరకూ — పద్దెనిమిదివసంతాల నవవధువులా భావనచేసికొంటూ, దివ్యలోకాలలో విహరిస్తూన్న లీలావతి హృదయం చివుక్కుమన్నది. ఒక్కసారిగా నందనవనంలో కల్పద్రుమానికి వ్రేలాడ తీయబడిన పూతీగల ఊయెల అమాంతం పుటుక్కున తెగిపోగా పాతాళంలోకి పోతూన్నట్టనిపించింది; రెండు చేతులూ ఆమెకు తెలీకుండా గుండెలమీంచి కన్నులపైకి నడిచినవి.

ఆపాదమస్తకం మహోఝంఝులో గులాబిరేకులా కదలిపోతున్నది. సుడిగాలిలో తిరిగే రావియాకులా భ్రమిస్తున్నది మనస్సు; గిలగిలలాడుతోంది హృదయం.

"భయపడకు లీలా —

రావుసాహెబ్ వెంకట్రాయుడుచౌదరి మహామహిషవాహనుడయిన యమధర్మరాజే; అయినా యమధర్మరాజు సామాన్యులు ఊహించేటంత భయంకరుడూ — క్రూరుడూ కాదు

ఒకానొక మానవునిశరీరంలో ప్రమాదకరమైన వ్యాధి అంకురించినప్పుడు వైద్యుడు కత్తులూ, కత్తెరలూ తీసి చికిత్స చేస్తాడు. కత్తులతో చీల్చి, సూదులతో సుకుమారచర్మాన్ని పొడిచే వైద్యుణ్ని కర్కోటకుడంటామా?

అలాగే యమధర్మరాజు కూడా చేసినపాపాలకు నిష్కృతి చేస్తాడు — అంతే!

న్యాయస్థానాన్ని అధిష్ఠించేవ్యక్తి — హత్యాభియోగం ఋజువు చేయబడినప్పుడు — దోషికి ఉరిశిక్షను ప్రసాదిస్తాడు; అంతలో ఆ జడ్జీ హంతకుడా?

అంతే లీలా — కొంచెం సంబాళించుకో. నుదురుమీదపట్టే చిరుచెమట తుడుచుకో. మన దాంపత్య జీవితాన్ని ఒక్కసారి మననంచేసికొని ఆనందిద్దాం"

అంటూ లేచి కిటికీవైపు నడిచి, జేబులోంచి చుట్టతీసి ముట్టించాడు.

లీలావతి డేగను చూసిన పావురంలా వణకిపోతూ అలానే కూర్చున్నది.

* * * *

"ఆతిరువాయి సలక్షణంగా మన వివాహం అయిపోయింది. నీ — నా స్నేహితులందరూ వచ్చారు. ఝామ్మంటూ ఊరేగింపులూ, కచేరీలూ, మేజువాణీలూ....ఎంత శోభాయమానంగా ఉంది ఆరోజు! భారతదేశంలో వైవాహికవ్యవస్థను నిర్మించిన సూత్రకారుడు ఎంతటి మహామేధావి....ఈ వ్యవస్థను ఋషులు నిర్మించారంటారు పెద్దవాళ్లు; ఋషులు గనకనే తర్జనభర్జనలు చేసి నిస్వార్థదృష్టితో ఉదాత్తంగా నిర్మించారు; కనకనే అది ఇంతకాలం సక్రమంగా నడిచింది—ఇప్పుడా చర్చ దేనికిలే......

ఆరోజు రాత్రి....

'ఏ రాత్రికోసం మనిషిలో యౌవనం అంకురిస్తున్నదాది హృదయం ఉవ్విళ్లూరుతూ ఉరకలు వేస్తూఉంటుందో — ఏ రాత్రి మానవుని జీవితంలో నూతనోషస్సులను ప్రకాశింపజేస్తుందో — ఏ రాత్రి రెండు పవిత్రాత్మలను దివ్యానుసంధానం చేస్తుందో - ఏవేవో ఉదాత్తమనోజ్ఞస్మృతులను రేకెత్తిస్తుందో — అవాఙ్మనసగోచరానుభూతి పరంపరలను ప్రసవిస్తుందో —'... ఆ రాత్రి ... లీలా .... నీ వినీలకబరిబంధంలో మల్లెలు ముడిచారు. అనంతాకాశంలోని నీలికాంతులమధ్య తారకా సముదయంలా నీ జడలో మల్లెలు మెరుస్తున్నవి. నువ్వు ఒయ్యారంగా, బహు చమత్కారంగా నిలబడ్డావు. పాముకూసంలాంటి చీరలోంచి నీ అవయవసర్వస్వం నన్ను ఆకర్షిస్తున్నది.

లే గులాబుల్లాంటి బుగ్గలు...

ఆ బుగ్గలలో...

అరుణాధరాలు....

వద్దు లీలావతీ — నువ్వు ఆ రాత్రి...అల్లసాని ఊహలోని వరూధినివి!

ఒకటి, రెండు క్షణాలకన్న నిన్ను నిలబడనీయలేకపోయాను. అమాంతం నా రెండుచేతులతో నిన్ను దగ్గరగా తీసికొని నిలువుటద్దంముందు నిలబెట్టి, చిలిపిగా చూపుడువ్రేలుతో నీ ముక్కు చివర ముట్టించాను. అద్దంలో నీ ప్రతిరూపం కన్నులు మిలమిల

లాడించింది. నీ వదనంలో ప్రసుప్తానందం అనిర్వచనీయంగా లాస్యం చేసింది.

నీ బుగ్గ నా పెదవులపై ఉంచుతూ, నీ కుడి చేతితో నాతల త్రిప్పుకున్నావు.

ఆ రాత్రి—

మల్లెల పరిమళాల్లో...

తొణుకుతూన్న లావణ్యలహరుల్లో...

పట్టిన చిరుచెమటల్లో...

మనం అనుభవించిన అమరసుఖాన్ని స్మృతి సీమను రప్పించినా నాలో పులకలెత్తుతున్నది—లీలా."

[అంటూనే ఆమెను తన వక్షానికి అదుముకున్నాడు. మొదటిరాత్రి అనుభవాలను నెమరువేసికొనే లీలావతి పొంగిపోయింది; అతని విశాలమయిన వక్షస్థలంపై ఆన్చిన తల పైకెత్తి, ఆ మైకంలో అతని పెదవులకు బుగ్గ ఎత్తింది. పెంట్రూయము చొరదిమునివ్రేళ్లు మాత్రమే ఆమె బుగ్గపై గిలిగింతలు పెట్టినవి; ఆ గిలిగింతతో నే చొరవరి ఆమె తలను ప్రక్కకు తప్పించి:]

"ఆ మరుచటిరోజు కూడా నిన్ను అలంకరించి పంపారు. నేను మధురసౌధ సోపానాలపై నీకోసం నిరీక్షిస్తున్నాను. వసంత వనలతలా నువ్వు లోపల అడుగు పెట్టావు. ఆనాడు కూడా నీ ముఖంలో నును సిగ్గు దొంతరలు నాట్యమాడుతూనే ఉన్నాయి నేను వ్రేళ్లూపుతూ నిన్ను పిలిచాను. నువ్వు చూపులతో కికురిస్తూ నిలబడిపోయావేకాని కదలిరాలేదు.

నేనే నీదగ్గరకు వచ్చి ఆలీఢపాదుణ్ణి అయి దోయిలించి నీ కన్నులలోకి చూస్తూ ఉండిపోయాను. నువ్వు ఎంతో సేపు నిలబడలేకపోయావు. అరచేతిలో నుదురు బిగించుకుని వెళ్ళి పందిరిమంచాన్ని ఆనుకున్నావు. ఏదో చెప్పలేని బాధ నువ్వు అనుభవిస్తున్నట్లు నాకు అనిపించినా నీ జగన్మోహన సౌందర్యానుశీలనలో నే నది గ్రహించలేకపోయాను. అదొక ప్రణయభంగిమ అనుకుని నిన్ను దగ్గరగా తీసికొని ముద్దాడాను. నువ్వు వణికిపోయావు...సిగ్గు...అనుకున్నాను. అంతలోనే నీ కన్నుల నీరు తిరిగింది. పరిశీలించాను...

'ఏి కారం—తల నొప్పి'

అన్నావు నువ్వు—హడిలిపోయాను నేను.

'ఫరవాలేదు....భయపడకండి'

అంటూనే నువ్వు అవతలివైపు తలుపు తీసుకుని వెళ్ళావు.

అనుసరించాను.

అక్కడ నీకు వాంతి అయింది. బెదురుతూ గదిలోకి వచ్చి డ్రాయరుపక్క కూజాలో నీళ్లు గ్లాసుతో తెచ్చియిచ్చాను. నువ్వు శుభ్రంగా పుక్కిలించి లోపలకు వస్తూ—నన్ను ఆసరా చేసుకుని—మంచం ఎక్కావు. మూలుగుతూ పడుకున్నావు.

నాకు చాలా భయం కలిగింది.

తలుపుతీసి యింట్లో చెబుదామని వెడుతుండగా నువ్వు నెమ్మదిగా చప్పట్లుకొట్టి పిలిచావు నేను వెనుదిరిగేసరికి ముక్కుమీద వేలేసుకుని, బాధతో నవ్వుతూ, చెయ్యి ఊపి వెనక్కు రమ్మన్నావు. నేను తలుపులు వేసేసి నీదగ్గరగా వచ్చాను.

అప్పట్లో నా కంతగా తెలీనివిషయాలవి. అదేదో అధికమయిన అనురాగంవల్ల అంకురించే వ్యాధి అనుకున్నాను...

ఆ రాత్రి కొద్దికుణాలబాధతోనే నువ్వు హాయిగా నిద్రపోయావు. నాకు ఆరాత్రి ప్రాణాలన్నీ నీమీదే ఉన్నాయి. కన్నుమీద రెప్పవాలలేదు.

ఆ మరునాడూ నీ ఆరోగ్యం అలానే ఉండిపోయింది. నా హృదయం నీకోసం ఎంత తపించి ఉంటుందో ఊహించగలవా? లీలా...

నాలుగోరోజున నువ్వు ఇంట్లోకి రాకూడదన్నారు. నీమీద అపారమయిన అనురాగంతో ఉన్న నేను ఎంతో బాధతో కాలేజీకి వెళ్ళిపోయాను.

ఆ తరువాయి మనం ఉత్తరాలద్వారా కలుసుకున్నామే కాని అంతకుమించిన దేమీ జరగలేదు. చదువులో పట్టుదల వహించటంతో నేను దృష్టిని మరల్చుకోక తప్పిందికాదు. పరీక్షలవుతుండగానే వద్దామని ఎంతో ప్రయత్నించాను; కాని అదేరోజు రాత్రి బండిలో మా కాలేజీకుర్రాళ్లు కాశ్మీర్ యాత్ర పెట్టారు. ఆ తిరగటం తిరగటం రెండునెలలు పట్టింది.

కాశ్మీరుదేశపు నిసర్గసౌందర్యం నా హృదయంలో ఆనందంతోపాటు విరహాన్నికూడా రేపింది;

అందమయిన ప్రతిపుష్పంలోంచీ నీ కన్నులు నన్ను ఆహ్వానిస్తూనే ఉన్నాయి. అందుచేతనే కాశ్మీరు నుంచి వస్తూనే—ఎవరెంత పట్టుపట్టినా వినకుండా—నీకోసం మీ ఊళ్లో దిగాను. నువ్వు అంతక్రితం రోజునే మీ మేనమామ కూతురు పెళ్లికి వెళ్లావన్నారు; నేను గడపలో కాలు పెడుతుండగా వసారాలోంచి ప్రక్క గదిలోకి వెళ్ళటం చూశాను, చూసినా మీ చెల్లెలేమో అనుకున్నాను. అప్పటికు మీ అమ్మమ్మ గారి బలవంతంమీద ఆగిపోయాను; ఆవిడ ఎంతో ఆప్యాయాన్నీ, ఆదరాన్నీ కనబరుస్తూ 'రాగానే కార్డు వ్రాయిస్తా — వచ్చి తీసికెళ్లు నాయనా' అన్నారు. ఆవిడ ఎంతమంచిది. ఆకాలపు మనుషులకు హృదయాలుండేవి, కనుకనే మనం ఈపాటి సుఖంగానయినా బ్రతికున్నాం. ఆ సాయంకాలం మీ చెల్లి అంది:

"అక్కయ్యను చదువుకోవద్దన్నారటగా మీరూ?"

తెల్లబోయాను; దానికి మాత్రం చిరునవ్వే జవాబుగా యిచ్చాను. కాని లీలా! నువ్వు చెప్పు—నిన్ను బి. ఏ. పూర్తి చేయమన్నానే కాని జూనియర్ చదువుతూ మానమన్నానా?...

* * * *

ఇరవైరోజులు...

మానవుని జీవితప్రమాణంలో ఇరవైరోజులు లెక్కలోకి రావు. జీవితసర్వస్వంగా భావించుకొన్న అర్ధాంగి ఆలింగనభాగ్యాన్ని కోరుతూ దీక్షతో తపస్సు చేసేవాడికి ఇరవైరోజులంటే ఇరవైకోట్ల సంవత్సరాలు కాదూ?

పోస్టుమాన్ వస్తూంటే పొంగిపోయేవుండే—అతను మా మేడదాటిపోతూన్నప్పుడు విరిగిపడిపోయేదంటే నమ్మగలవా? అలా రోజూ ఆశ—నిరాశ!

ఆఖరికి ఓరోజున గుమ్మంముందు నిలబడ్డాడు. ఎగిరి గంతేసి వెళ్ళి అందుకుని చూశాను—చూశానంతే! పూర్తిగా నీరసపడిపోయాను. ఆ ఉత్తరం నా స్నేహితుడు వ్రాశాడు. వాడు విశాఖపట్నం ఆసుపత్రిలో సర్జన్‌గా పనిచేస్తూ, కాపురం ప్రారంభించాడు. క్రొత్తదంపతుల్ని వచ్చి చూసిపొమ్మని వ్రాశాడు; అదేజాబులో వాడి భార్య నిన్నుకూడా తీసుకురమ్మని మూడుసార్లు హెచ్చరించింది.

ఆ కార్డుతో నిన్ను కలుసుకునేందుకు బయలుదేరాను. తెలతెల్లవారుతూండగా మీ గడపలో కాలు పెట్టాను. తొమ్మిదిగంటలబండిలో నిన్ను తీసుకు బయల్దేరాలని ఊహ.

కానీ —

ఆరోజునా నువ్వు అక్కడ లేవు. మీఅమ్మమ్మగారే నాకు మామూలు ఆదరాన్ని ప్రసాదించి 'పెద్ద మేనత్తగారు గృహప్రవేశం చేసుకుంటూ స్వయంగా వచ్చి తీసికెళ్ళారు నాయనా' అంది.

నేను సగంచచ్చి విశాఖపట్నం బయలుదేరాను.

రైలు దిగుతూండగానే వాళ్ళిద్దరూ కిలకిల నవ్వుతూవచ్చి నన్నింతో యిదిగా చూస్తూ, నీకోసం కాస్సేపు ఆగారు. తెలిసీ నేను నవ్వి ఊరుకున్నాను. నీగురించి ప్రశ్నించటానికి వాడు సిగ్గుపడి ఉంటాడు. ఆవిడ మాత్రం దారిలో రెండు, మూడు సార్లు ప్రశ్నించినా నేను ప్రసంగధోరణిలో ఆవిడను వినిపించుకోనట్లే సాగాను.

ఇంటికి చేరేసరికి వాడికి హాస్పిటల్‌నుంచి అర్జెంటుగా కబురు వచ్చింది; వాడు ఆమెను లోపలకు పిలిచి అన్నీ పురమాయించి వెళ్ళిపోయాడు.

స్నానంచేసి నేను బట్టలు కట్టుకుంటుండగా ఆవిడ వడ్డన పూర్తిచేసి పిలిచింది. భోజనం చేస్తూండగా:

"ఆయన్ను అసలు కదలనిచ్చేదాన్ని కాదు; కేసు ప్రసవానికి సంబంధించింది; పాపం ఆ అమ్మాయికయినా అంత పెద్ద వయసులేదు. అయినా అదృష్టవంతురాలు! పద్ధెనిమిదో ఏడు నిండకుండా పురిటికొచ్చింది; కూడా ఆ అమ్మాయి చెల్లెలే వచ్చింది. నేను రెండుమూడుసార్లు వెళ్ళి పలకరించి 'మరేం భయంలేదమ్మా, ఆయనతో నే చెప్తా' అని ధైర్యం చెప్పివచ్చాను. తొలికాన్పేమో కాస్త బెదురు..."

అంటూ ఆవిడ కులాసాగా మాట్లాడేస్తూ, రెండుమూడుసార్లు నిన్ను తీసుకురానందుకు నామీద కొంచెం కోపంకూడా వ్యక్తంచేసింది. నేనుమాత్రం పెదవి కదపలేదు. భోజనం ముగించి, వాకిట్లోకి వచ్చేసరికి తాంబూలం సిద్ధంగాఉంది. చాలా ప్రయాణం చేసివచ్చారు. ఆ గదిలో విశ్రాంతి తీసికోండి.'

అని ఆవిడ వంటింట్లోకి నడిచింది.

నేను నిద్రలేచేసరికి వాడూ వచ్చాడు; వాడు లోపల కొస్తూంటగానే

'తల్లీ—పిల్లా కులాసా?'

అని ఎంతో ఆతురతతో అడిగింది.

ఆ అమ్మాయికి ఎంత మమకారమో పిల్లనుకన్న తల్లి అంటే.

'ఫరవా లేదు, భగవంతుడున్నాడు. మొదటి కాన్పు కదూ!

చాలా శ్రమపడ్డది. కొత్తగా వచ్చిన లేడీ డాక్టరు సౌభాగ్యలక్ష్మి చాలా శ్రద్ధతీసుకుంది—అసలు తల్లికే ప్రమాదం వస్తుందేమో నని భయపడ్డాం; కానీ ఇద్దరూ దక్కారు. మగబిడ్డ పుట్టాడు."

అన్నాక, వాడి కోటు విప్పింది—అప్పుడు వాడు భోజనం చేశాడు. భోజనం అయ్యాక:

'ఏరా, కనీసం మా చెల్లితో పెళ్ళినాడు తీయించుకున్న ఫోటో లేదుట్రా?'
అన్నాడు.

నేను నవ్వుతూ అందిచ్చాను.

తమలపాకులకు సున్నం రాస్తూన్న ఆమె ఒక్కసారి ఫోటోలోకి చూసి, నన్నుచూసి ఫోటోను పరిశీలిస్తూ:

'ఎంత మోసం చేశారు, అన్నయ్యగారూ'

అంది.

నేను తెల్లబోయి వెర్రిచూపులు చూశాను.

'ఇంక దాచలేరు. కాస్సేపు ఆయన విశ్రాంతి తీసుకున్నాక మనం హాస్పిటల్‌కి వెళదాం'
అంది.

నాకేమీ అర్థం కాలేదు.

'నువ్వు అదృష్టవంతుడివిరా, వెంకట్రాయుడూ అంత అందమయిన అమ్మాయి—అంత తెలివయినది... నీ అదృష్టం వేరే చెప్పాలా? నువ్వు చాలా అన్యాయం చేశావురా, కనీసం ఆవిడను పురిటికి పంపుతూన్నట్టయినా నాకు ఉత్తరం వ్రాయాల్సింది. అయితే నేం, ఇప్పుడు వెళ్ళి చూద్దాం'
అన్నాడు.

అప్పటి కర్థమయింది—ఆ ఫోటోలో ఉన్న అమ్మాయీ, ఆ రోజున పురుడుపోసుకున్న అమ్మాయీ నువ్వేనని..."

[అని ఆగి చుట్ట విసిరేసి కిటికీలోంచి దొడ్డివైపు శూన్యంలోకి చూడసాగాడు. లీలావతి గుండెలో చలనశక్తి క్షీణిస్తున్నది. ఆమె శరీరంలోని ఏ అవయవమూ చైతన్యంతో లేదు. ఆమె కన్నులు యాంత్రికంగా నడుస్తున్నవి. ఆమెకు ఏడవటానికయినా శక్తి లేదు. ఆమె కనులయెదుట విశాఖపట్నం ఆసుపత్రిలో ఉయ్యాలలో ఊగుతూన్న పసికందు కనిపిస్తున్నాడు.]

"అప్పుడు వాడితో నే నన్నాను:

డాక్టర్ భాయీ! నువ్వింకా అనుభవం సంపాదించాలిరా. భర్తమీద అమితమయిన అనురాగం ఉన్న భార్యకు ప్రసవ వేళ. అందులో ప్రథమ సంతానం—ఎంత ఆనందం కలుగుతుంది. స్త్రీకి మాతృత్వం ప్రసాదించే గర్వ, గౌరవాలను ఇంగ్లీషు చదువుకున్న వాళ్లేం అర్థం చేసికోలేమురా.

ఆ సంతోషానికి తోడు నేను కూడా ఎదురుగా ఉంటే ఆమె తట్టుకోలేక స్మృతి విహీనురాలు కావొచ్చు—మరేమయినా కావొచ్చు. అసలు నేను వచ్చినట్టు కూడా ఆమెకు తెలీనివ్వకు. నేను రానని చెప్పాను. కాని రాకుండా ఉండలేకపోయాను. కారణం నీకు తెలుసు—నీ ఉత్తరం కూడా నా రాకకు కొంత ప్రోత్సాహం యిచ్చింది. నేను వచ్చి ఆమెకు కనిపించకుండా వెళ్లిపోయానంటే కూడా ఆమె మనస్సు పరిపరివిధాల పోతుంది. భోజనం మానేసి వెళ్ళి వాళ్ళను కాపాడావు. అదే పదివేలు'—అన్నాను. వాడు నా వాదానికి లొంగి 'సరే' అని ఆపాటి స్వల్పవిషయం తెలీనందుకు సిగ్గుపడ్డాడు.

*　　*　　*　　*

ఈ లోకంలో ఇటువంటిసంఘటనలు అనేకాలు జరుగుతాయి. ఇంతకన్న విపరీతమయినవీ, హృదయవిదారకమయినవీ జరుగుతాయి, ఇదివరలో జరిగాయి. సత్యవతిని శంతనుడు ప్రేమించాడు. సత్యవతి శంతనుణ్ణి వలచింది. దాశరాజు షరతులుంచాడు—కూతురు భవిష్యత్తుకోసం. అంతే గాదు—ఆమెకే వ్యాసభగవానుడు పుట్టాడనీ తెలుసు. కాని శంతనుడికి ఈ సంగతి తెలియకనే పెళ్లాడాడా? తెలీకనే కావొచ్చు.

ఇలాటివన్నీ కథలంటాం మనం; నీ జీవితగాథ విన్నవాళ్లు నమ్మగలుగుతారు. చిత్రమయినది లోకం లీలా—

ఆ సాయంత్రమే బయల్దేరి నేను నేరుగా యింటికి వచ్చి అన్నీ సర్దుకుని మరునాడుదయం మేల్‌లో మదరాసు చేరుకున్నాను. అక్కడనుంచి మీ యింటికి ఉత్తరం వ్రాశాను.

'నాకు రెండు సంవత్సరాల వరకూ ఇక్కడనుంచి కదలటానికి వీలుండదనీ. ఈ రెండేళ్లూ నాతో పాటు నువ్వు కూడా విరహయాతన అనుభవించాలనీ, అప్పటికి నేను లాయరు నౌతాననీ, అవగానే నీతో సంసారజీవితం ఆరంభిస్తాననీ' వ్రాశాను.

ఆ ఉత్తరానికి జవాబుగా నే 'అమ్మాయికి ఆరో నెల అనీ, మూడు, నాలుగు మాసాలలో నేను తండ్రిని కాబోతున్నాననీ వ్రాశారు. అప్పట్లో నువ్వు వారానికో కవరు వ్రాసేదానివి.

నువ్వు వ్రాసే ప్రతికవరూ నాలో ఎంతో ఆనందాన్ని కలిగించేది. ఉత్తరాలు వ్రాయటంకూడా కళగానే భావించే నాకు తగిన భార్య దొరికిందని సంతోషించాను.

నిజంగా కష్టమే కాదు లీలా?

నీగుండెఃమీద చిట్టిగాడు పడుకుని నీ సొట్టలు పడే బుగ్గలలో గిలిగింతలు పెడ్తున్న రోజులలో ఆరు మాసాల గర్భవతి మనస్తత్వంతో, కాబోయే తల్లి ఊహలతో....ఎంతకష్టం...లేఖలు వ్రాయటం! కానీ ఒక్కసారి దొరికిపోయావ్. నాకు తెలుసు — ఎప్పుడో అటువంటిసన్నివేశం సంభవిస్తుందని.

అప్పుడు నీ చిట్టికి విషజ్వరం తగిలింది. వాడు బ్రతికి బయట పడతాడనే ఆశలేదు — కానీ వాడు కోలుకున్నాడు. ఆ జ్వరం రోజుల్లో నువ్వు వ్రాసిన ఉత్తరం చదువుతా:

డియర్!

ఈరోజున కూర్చుని ఆలోచిస్తూంటే చిట్టిగాడు నా వడిలోంచి ఎగిరి మీ దగ్గరకు రాబోయి క్రింద పడ్డాడు.

వాడికి వారంరోజులనుంచీ జ్వరం కాస్తూనే ఉంది. మూసినకన్ను తెరవటంలేదు. ఒళ్లు సలసల కాగిపోతోంది. వాడు దక్కుతాడనే ఆశలేదు. ఒక్కసారి వచ్చిచూసి వెళ్ళండి.

నిజంగా ఆ ఉత్తరం అందుకోగానే బయల్దేరి వస్తే ఎంత ప్రమాదించేది. ఆ ప్రమాదా లేమీ రాకుండా ఉండటానికే నేను రెండేళ్ళవరకూ రావటానికి వీలు లేదని వ్రాసేశాను. సరిగ్గా మన వివాహం జరిగిన ఎనిమిది నెలల ఇరవై నాలుగురోజులికి నువ్వు ప్రసవించినట్టు మీ మావయ్య వ్రాస్తూ, ఇదేం విపరీతం కాదనీ, మనం ముందు కలుసుకున్న రోజునుంచీ లెక్కించాలనీ సూచనగా వ్రాశారు.

సుఖంగానే ప్రసవించావనీ, మొదటి కానుపు మగబిడ్డ నయినా ఏమీ శ్రమలేదనీ వ్రాశారు. నేను బ్రహ్మానందం చెందినట్టు ఉత్తరం వ్రాశా. ఓసారి వచ్చి చూసి వెళ్ళమని వ్రాశారు. ఒకవేళ నేను వస్తానని అనుమానం కలిగితే ఏదో నక్షత్రం చూసి శాంతి తతంగం చేద్దురు. అయినా నాకు రావటానికి తీరిక లేదుగా.

* * * *

నేను చిట్టిగాడికి రకరకాల వస్తువులూ, బట్టలు బహుమతులుగా పంపుతూనే ఉన్నాను. నువ్వు చిన్నిచిన్ని కథలుగా ఉత్తరాలు వ్రాస్తూనే ఉన్నావు. ప్రతి ఉత్తరంలోనూ ఒక్కసారి — ఒక్కసారే — వచ్చి చూసి పొమ్మని వ్రాసేదానివి. నా ఉత్తరాలు నిన్ను లాలించి, జోల పాడుతూనే ఉండేవి.

బార్ లెక్చర్లూ, ఎప్రెంటిస్ షిప్పూ అయాక ప్రాక్టీసు ప్రారంభించటానికి సన్నాహాలు పూర్తి చేసికొని వచ్చి నిన్నూ, నీ చిట్టినీ ఈ యింటికి తెచ్చాను.

ఇంట్లోకి రాగానే మా వంశాన్ని గురించీ, వంశమర్యాదని గురించీ వివరిస్తూ మేడ పైభాగం అంతా నీ స్వాధీనంలో ఉంటుందనీ, నాకు తెలియజెయ్యకుండా నువ్వు మేడ దిగరాదనీ శాసనంగా చెప్పి నా ఆ అభిప్రాయం నీకు అందనివ్వలేదు.

జీవితంలో ప్రప్రథమంగా నువ్వు నాకు సుఖాన్ని చవిచూపిన గదే నీకు శయ్యాగారంగా ఏర్పాటు చేశాను.

లీలా! నిన్ను చూసినప్పుడల్లా నా హృదయం ఎంత పొంగిపోతుందో అంతా వ్యాకులపడుతుంది. నీకు నేను అన్యాయం చేస్తున్నానేమో అనిపించింది. అప్పుడుమాత్రం బాధపడ్డాను. పడ్డానుకాని ఆలోచించిచూస్తే నువ్వు నాకు చేసినదానికంటె నేను

నీకు ఎక్కువేం చేయగలిగానో చెప్పు. నేను చేసింది నీవుచేసిన దానితో సమంగా అయినా తూగుతుందా అని.,

అయితే ఇంతకూ కారణం నీ సౌందర్యం.

సామ్రాజ్యాలను నాశనం చేసినదీ — సర్వతోముఖప్రతిభా సంపత్సమున్మేషాన్ని సర్వనాశనం చేసినదీ — ఏకప్రాణులుగా సంచరించేవారిమధ్య బద్ధవైరాలను రేకెత్తించి తలలు తీయించేసినదీ...ఇంకా ఇంకా ఎన్ని ఘోరాలకో కారణం సౌందర్యం— లీలా—నీ సౌందర్యం అంతటి ఘోరాలు చెయ్యలేకపోయినా అంతకన్న అమానుషమే చేసింది.

అది నిన్ను నాశనం చేసింది — నన్ను పీల్చేసింది.

నీ కొడుకుని పరమభ్రష్టుణ్ణిగా చేసింది.

అప్పుడే వికసించిన గులాబిపువ్వు పూలతోటకు శోభ తెస్తుంది. తోటంతా ఆ ఒక్క పువ్వుతో కలకలలాడుతూన్నట్లుంటుంది - అసే గులాబీ అక్కా-చెల్లెళ్లిద్దరికీ కావలసివచ్చినపుడు కొద్దిగా పేచీ రేగుతుంది; అది క్షణికమే అయినా, రేగి తీరుతుందంటావా? ప్రాకృతిక సౌందర్యంలోనే ఉంది విషం లీలా!

నిగనిగలాడే గోధుమ వన్నెత్రాచు కోరలో ఎంత విషం! పడగవిప్పి ఆడుతూన్నప్పుడు దాని రాజససౌందర్యానికి ముగ్ధులమయిపోతాం. అది ఒకే ఒక్క కాటు వేస్తుంది. క్షణంలో కైవల్యప్రాప్తి. పాము విషం కనక సద్యోముక్తి లభిస్తుంది.

కానీ...మానవసౌందర్య విషం! నెమ్మది నెమ్మదిగా పనిచేసి కుళ్లబెడుతుంది. పాములోని విషం పాముని ఏమీ చెయ్యలేదు. సౌందర్యవిషం సౌందర్యవతినే కబళిస్తుంది.

లీలా,

ఆ రోజు నీకూ జ్ఞాపకం ఉండిఉంటుంది. ఉండకపోవటానికి సావకాశం లేదు. జీవితంలో మధుర స్మృతులను మరువలేనట్లే విషాద సన్నివేశాలనూ విస్మృతిపాలు చెయ్యలేం.

*   *   *   *

సరిగ్గా మన గోడగడియారం తొమ్మిది గంటల నలభై నిమిషాలను చూపుతూండగా నువ్వు మొదటిసారి మేడ దిగావు. రాత్రి వేళ తొమ్మిది గంటలు దాటాక నువ్వు మేడదిగటం అనేది కాపురానికొచ్చిన ఆ నాలుగేళ్లలో జరగలేదనుకుంటాను.

ఆ మేడమెట్లు ఒకొక్కటే దిగుతూన్నప్పుడు నీ కన్నుల్లో ఎంతటి ఆశా—ఆనందం ఉంటాయో, నీ హృదయం ఎలా ప్రఫుల్లమవుతూ ఉంటుందో, నీ మనస్సు ఎటువంటి అనుభూతులకు స్వాగత గీతాలు ఆలపిస్తూఉంటుందో, నీ శరీరంలోని ప్రతి అవయవం ఏవిధంగా పులకిస్తూంటుందో ఊహించగలను లీలా! అనుభవించలేకపోయినా భావించగలను కాదూ?

ఆనాటివరకూ ఎన్నడూ రాత్రిభోజనాల అనంతరం నేను నీతో మాట్లాడేవాణ్ణే కాదు. నాకు పనిలేని రోజే లేనప్పుడు నీతో మాట్లాడుతూ కూర్చునే సావకాశం ఎక్కడుంటుంది చెప్పూ? నిరంతరం నాతో నా స్నేహితులెవరో ఒకరు ఉంటూనే ఉండేవారుకదా—అలాంటప్పుడింక తీరిక కూడానా.

ఒకవేళ భోజనానంతరం కాస్సేపు కూర్చున్నా నువ్వు నీ చిట్టిని తీసికొని వచ్చి:

'చూశండీ, మన చిట్టి మీకోసం ఎలా ఆశగా చూస్తూ నవ్వుతున్నాడో, వాడికి నాన్న అనే పేరు కూడా వచ్చేసింది.'

అనేదానివి. నేను అలానే కూర్చుని నవ్వుతూ:

'ఔను, ప్రతివాడికీ కన్నతండ్రిమీద మమకారం ఉండాల్సిందే. వాడికిమాత్రం ఆ అదృష్టం చిక్కేటట్టు లేదు, పాపం' అనేవాణ్ణి.

'నిన్న మధ్యాహ్నం అడ్వోకేటు సుబ్బారావుగారింటికి వెళ్ళాను. వాళ్లి మూడో మనవరాలు పుట్టినరోజు. అక్కడ అందరూ మన చిట్టిని ఎత్తుకు ముద్దాడినవారే. వాళ్ల రెండో మనవరాలు చిట్టిని తీసికెళ్ళి వాళ్ళ యింట్లో బొమ్మలన్నీ చూపించింది; అక్కడే ఉంచేసుకుంటామంది, వాళ్లి రెండో అమ్మాయి లలిత.

అని నువ్వు చెప్తూన్నప్పుడల్లా:

'తప్పు తప్పు లీలా—కష్టపడి నవమాసాలూ మోసి కని, నానా యాతనలూ పడి వాణ్ణి పెంచినదానివి నువ్వు. ఆ ఆనందాన్ని నువ్వే అనుభవించాలి; అందులో నేను భాగస్వామిని కావటం అన్యాయం కాదూ?

వాడు నీ కొడుకు. నీ చిట్టి. ఏ శ్రమా లేకుండా వచ్చే ఆనందాన్ని, ఫలాన్ని నేను భరించలేను లీలా, అందులో ఏమాత్రం నాకు హక్కు లేదు

అనేవాణ్ణి గుర్తుందా!

అటువంటప్పుడు నువ్వు ఎంతో గర్వంతో పొంగిపోయేదానివి. అదంతా నీకు నేనిచ్చే 'కితాబ్' గానే భావించేదానివి. నిజంకూడా అంతే. అలానే వాడికి చదువు చెప్పుకుంటూ భోజనాలవేళ నాముందు వాడి విద్యాప్రదర్శనం చేయిస్తూ ఆనంకించేదానివి.

నీ కళ్ళముందు వాడి భవిష్యత్తు జిల్లా జడ్జీ— అంతే కాదూ. అలానే ఆనందించేదానివి. నీ ఆనందాన్ని చూసి నేనూ సంతోషపడేవాణ్ణి. ఈ ప్రపంచంలో ఎదుటివారి ఆనందాన్ని చూసి ఏడిచేవాళ్లనూ, వారి ఆనందానికి భంగం కలిగించేవాళ్ళనూ నేను క్షమించలేను; వాళ్ళంటే నాకు పరమ అసహ్యం. గొంగళీపురుగుల్లా చూస్తాను వాళ్లని. అలానే నా ఆనందాన్ని చూసి ఓర్వలేనివాళ్లనూ, సంతోష నౌకా విహారవేళ తుపానులు రేపేవాళ్ళనూ నేను క్షమించి వదలలేను. దానికి కారణం ఉంటుందని నీకు తెలుసు కాదూ?

ఆరాత్రి నువ్వు మేడమీంచి దిగుతున్నావు. నీకు జ్ఞాపకం ఉండిఉంటుంది. అంతకు అయిదు రోజులముందే చిట్టిగాడికోసం రెండుగదులతో డాబా కట్టించాను. అందులో ఒక గదిలో విశేషం ఏమీ లేదు. రెండవగది నిర్మించటంలో మేస్త్రీ కాస్త శ్రమపడ్డాడు. ఆ గదిలో ఏ క్షణంలో ఏం జరుగుతున్నదీ తెలిసికోవాలనే కుతూహాలం కలిగితే నా ఆఫీసు గది కిటికీ తెరిస్తే చూడగలగాలి. ఆ గదిలోంచి నా పడకగదిలో నడిచే కథ కనిపించాలి. ఆ నిర్మాణంలో కాస్త శ్రమ లేకపోలేదు. అయినా అదో శ్రమా?

అఖిలలోకాశ్చర్యకర సౌందర్యలీలా విలాస విభ్రమంతో ఆవిర్భవించిన నిన్ను ఎదురుగా ఉంచుకుని ఒక్క క్షణంకూడా తీరిక లేకుండా జీవించటం కంటె ఘోరనరకం ఏమిటుంటుంది లీలా!

జరిగింది! జరుగుతుంది! అయినా జరిగినదే చెప్పుకుందాం!

నా ఆజ్ఞానుసారం ఆరాత్రి నువ్వు రెండు కప్పుల ఓవల్టిన్నూ, బ్రెడ్, బిస్కెట్లుతో నా గదిగడపలోకి వచ్చావు. గుమ్మంలో నిస్సపోయి నిలబడ్డావు. గదిలో నేను లేకపోవటమే కాక ఎవరో కొత్తమనిషి సోఫాలో పడుకుని ఉండటమే నీ ఆందోళనకు కారణం.

*   *   *   *

[లీలావతి గుండె గుబగుబలాడింది. ఆమె కన్నుల ముందు స్వర్గం ప్రకాశిస్తున్నది. ఆమె మనస్సు అన్ని సంవత్సరాల వెనక్కు నడిచింది.]

కిలకిల నవ్వింది మనస్సు—
ఫక్కున పలకరించింది హృదయం—
మిలమిల మెరిశాయి కన్నులు—
బుగ్గలలో సుడులు అస్పష్టంగా ఏర్పడ్డాయి!!

సర్వాంగాలూ పులకరించినా అడుగు కదపలేక పోయింది లీలావతి.

ఎదురుగా సోఫాలో సిగరెట్ పీలుస్తూ, గేగీరేగని జుత్తులోకి వ్రేళ్లుపోనిచ్చి, గోడమీది కళాప్రతిమలను ఆలోకిస్తున్న దివ్యమోహన మానవుడు కనుపించాడు. ఆమె పదములు వణకినవి—నిశ్వసించింది.

ఆ నిట్టూర్పుకు ఉలిక్కిపడి, ఆలోచనాపూర్ణ శరన్మేఘ శకలాలను ఛిన్నాభిన్నంచేసి, ఆమెవైపు చూస్తూ:

'లోపలికి రావచ్చు' అన్నాడు.

లీలావతి గుండె పొంగిపోయింది.

మనస్సు కుతకుతలాడుతున్నది.

క్షణకాలం ఆలోచన సాగలేదు.

గుండెను చిక్కబట్టి మనస్సు ఆలోచించ సాగింది.

సరిగ్గా తొమ్మిదిగంటల నలభైఅయిదు నిమిషాలకు రెండుకప్పుల ఓవల్టిన్నూ, బ్రెడ్డూ, బిస్కెట్లూ తీసుకురమ్మన్నారు. అన్నీ సిద్ధంచేసుకు వచ్చేసరికి ఆయన లేరు.

ఏమిటి విశేషం?

ఎన్నివిధాల ఆలోచించినా ఈ 'తిలస్మ' చ్ఛేదన రహస్యం ఆమెకు అందటం లేదు.

అయినా ఈ మనరమ్మని పిలుస్తున్నారు వెళ్లక తప్పదు.

సభ్యత కదలమంటుంది—
సంస్కృతి ఆగమంటుంది—

నాగరకత నడవమంటుంది.

దాన్ని త్రోసిరాజంటుంది సంప్రదాయం.

లీలావతి అడుగు వెనక్కు నడపలేకపోయినట్లే, ముందుకూ సాగలేకపోయింది. పంటకాలువ మధ్యలో ఊగిసలాడే వరిమొక్కలా ఉంది ఆమె స్థితి.

"లోపలకు రావొచ్చు; కామేశ్వరరావు జీవితంలో ఎవరి స్వాగతాన్నీ, ఎవరి ఆతిథ్యాన్నీ తిరస్కరించలేదు." అన్నాడాయన.

అడుగులు గడపదాటి గదిలో లీలావతిని ప్రవేశపెట్టినవి. నెమ్మదిగానే అడుగులు వేస్తూన్నది. ఆమె హృదయం ఆయనవైపు నడుస్తున్నది. మనస్సు నిర్భయంగా ఆలోచిస్తున్నది.

జీవితంలో ఏడు సంవత్సరాలనుంచి కన్నకొడుకు వినా ఏపురుషస్పర్శా ఎరుగని ఆమెశరీరం—స్పర్శలోని ఆనందానుభవాన్ని రుచిమాచిన లీలావతి శరీరం పులకలెత్తింది.

ఆమెకు తెలీకుండానే ఆమె ముఖంలో మల్లెలు విరిసినవి; చెక్కిళ్ళలో గులాబులు నవ్వుతున్నవి. ఆ క్షణంలో ఆమె పూర్తిగా అసహాయ!

కామేశ్వర్రావు సోఫాకెదురుగా ఉన్న మేజామీంచి సిగరెట్టిన్నూ, అగ్గిపెట్టీ తీసి సర్దసరిజేశాడు.

లీలావతి తలవాల్చుకునే వచ్చి చేతిలోని ట్రే మేజామీద పెట్టింది.

కామేశ్వర్రావు వెనక్కు వ్రాలి:

'ఇలా కూర్చోవచ్చు'

అని తనప్రక్కగా చెయ్యి చూపాడు.

లీలావతి వణికింది. వణుకుతూనే!

'ఆ ఆయన?'

అంది.

'ఆయనా?'

అని పకాల్న నవ్వి:

'హైకోర్టుజడ్జీ వచ్చారుట. రాత్రి ఒంటిగంటదాకా రానన్నాడు. వచ్చినా వాడితో నీకేంపని? వాడిపెళ్లాం ఉండగా'

అని బిస్కట్ తీసి కొరికాడు.

లీలావతి హృదయం కుదుటపడింది.

కూర్చున్న పెద్దమనిషికి తానెవరో తెలీదు. తను వెంకట్రాయుడుచౌదరి భార్యనని మాత్రం ఈయనకు తెలీదు.

అయితే రాత్రి ఒంటిగంటదాకా రానని తనతో ఎందుకు చెప్పలేదు. బహుశా కింద కూర్చుని మాట్లాడుతుండగా ఫోనులో వార్త చేరిందేమో.

మనస్సుకు సంబంధించిన ఆలోచనలో కాలాన్ని వ్యర్థం చేయటంకంటె హృదయాన్ని కరిగించే వాంఛానుభూతిని పరిపూర్తిచేసికోవటం అవశ్యం అయింది.

కూర్చున్నది లీలావతి!

జంకుతూనే కూర్చున్నది!

సోఫా ప్రక్క ఉన్న కిటికీలోంచి మల్లెలవాసనలు గుమ్మమంటున్నాయి. తొలగించిన తెరల్లోంచి చల్లగాలి మల్లెల మత్తుతో వచ్చి గిలిగింతలు పెడ్తున్నది. పైన ఫాన్ లీలావతి హృదయవాంఛతో సమంగా గిరగిర తిరుగుతున్నది.

కామేశ్వరరావు మనస్సు పనిచేయటం మానేసింది. అతనిచేతులు మేజామీది కప్పును తీసి లీలావతి పెదవుల కందించాయి. ఆశానేత్రాలతో ఆమె అతనివైపు చూస్తూ పెదవులతో చప్పరిస్తున్నది.

అతని కుడిచేయి కదలింది. కదలిన చేయి ఆమె బుజంమీద వ్రాలింది—లీలావతి చేతిలోకి వచ్చిన కప్పు మేజామీదికి నడిచింది. ఆమె పెదవులు అతని పెదవులను జేరుతూ వణుకుతున్నవి.

"లీలావతీ, సరిగా అదేసమయానికి నేను వీధిగుమ్మంలో నిలబడి బటన్ నొక్కాను. నువ్వు ఝంఝామారుతంలోని ఎండిన చింతాకులా చలించిపోతూ వచ్చి తలుపుతీశావ్. నేను లోపలకొస్తూనే:

"వెరీగుడ్, నువ్వు నామాట మరచిపోయి నిద్రపోతావేమో అనుకున్నాను. టైముకి చెప్పినట్లూ తెచ్చావు. పైకి పోయిపడుకో" అన్నాను.

నీహృదయం పొంగిపోయి ఉంటుంది.

ఆషాఢ ప్రథమ దివసాంత వేళావ్యాప్త పుష్కలావర్తకాంభోధగోద్భూత పర్జన్యగర్జాసదృశంగా వినబడిన బెల్‌తో నీహృదయం గజగజలాడిపోయినా, నావాక్యాలు అందులోని సౌదామినుల్లా నీకన్నుల్లో మెరిసి నిన్ను కుదుట బరిచాయి.

నువ్వు చేసినపనేమీ నాకు తెలీలేదనే ఆనందంతో నువ్వు మేడమెట్లు ఎక్కేసి ఉంటావు—అంతేనా?

అప్పుడు నువ్వు విడిచిన నిట్టూర్పులో ఎంత ఆనందం ఉందో—అంత ఆవేదనా ఉన్నది.

ఔను—సిద్ధాన్నం!

కొన్నిరోజులనుంచీ అన్నపు మెతుకు చూడనోచుకోని మనిషికి షడ్రసోపేతంగా భోజనం సిద్ధం చేసి, రజితపాత్రలో వడ్డించి, బంగారపు పువ్వుల పీటమీద కూర్చోబెట్టి, సరిగ్గా కంచంలోకి చెయ్యి పోనిచ్చేవేళ, కంచంతీసేసి, ఆ మనిషిని తన్ని తగిలేస్తే పడేబాధకూడా నీబాధకు సరిగాదు లీలా.

కానీ — అంతా తెలిసిఉండీ నేననుభవించే బాధతో పోల్చగలవా?

నా బాధను ఎరిగినవాడు ఒక్కడే ఒక్కడున్నాడు. వాడు అడుగో! నువ్వు ఈ మేడలో అడుగు పెట్టింది మొదలు ఏచలనమూ లేకుండా ఒకే నృత్యభంగిమలో ఉన్న నటరాజరాజేశ్వరుడు.

నీకూ తెలిసి ఉంటుంది.

తెలియటమే కాదు గుర్తులోకూడా ఉంటుంది. ఆరాత్రి వచ్చిన అతిథి తెల్లవారుఝామునే లేచి వెళ్ళిపోయాడు అయితే వాడు నాతోకూడా చెప్పకుండా వెళ్ళినట్లు నీకు తెలీదు. అంత జరిగినా, జరిగినదానికి వాడుకూడా నీ అంతా బాధ్యుడే అయినా నేను ఆ ప్రసక్తి తేకుండా వాడితో ఆరాత్రి గడిపేశాను. నిద్రకు లేనూమాత్రం అన్నాను. 'ఈ ఏర్పాట్లన్నీ మా ఆవిడవి. ఆవిడ కాలేజీ చదువు చదివినా వంటకాలలో బాగా ఆరితేరింది. ఇప్పుడివన్నీ తెచ్చినావిడే మా శ్రీమతి'—అంతే—వాడి ముఖంలో కత్తివాటుకు నెత్తురుచుక్క లేదు. ప్రాణస్నేహితుడికి అంతకంటె శిక్ష ఏంకావాలి? అందుకే వాడి అంతరాత్మ వాడిమొహాన్ని నాకు చూపనివ్వకుండా, తెల్లవారుఝామునే కదిలించేసింది. వాడు మళ్ళీ ఈయింటికి రాలేకపోయాడు.

ఇప్పుడడుగుతున్నాను లీలావతీ—

నీకు నమ్మకం ఉన్నా, లేకపోయినా ఈ నటరాజరాజేశ్వరుడిమొహం చూసి చెప్పు—నీకు కొడుకు పుట్టినతరువాయి మళ్ళీ నువ్వు సాంసారిక సుఖాన్ని అనుభవించావా?"

అని రావుసాహెబ్ దీర్ఘనిశ్వాసం విడిచి ఒక్కసారి కిటికీదగ్గరకు వెళ్ళివచ్చి కుర్చీలో కూర్చున్నాడు. ఆమె కనుగొలకుల్లో అతుక్కుపోయిన ఆఖరి కన్నీటిచుక్కలు రెండూ ఒడిలో రాలినవి. అతనికి సమాధానంగా తల అడ్డంగా ఊగింది.

"నాకు తెలీకకాదు లీలా — మానవుడికి జీవితంలో అవసరమయినవి తిండీ — గుడ్డా మాత్రమే కాదు. తదతీతమయిన మానసిక వికాస, సంతృప్తులు. ఈ అవసరాలను ప్రభుత్వాలు గుర్తించనూలేవు, రాజకీయవర్గాలు తీర్చనూలేవు. మానవుడికీ — మానవుడికీ మధ్యనుండే సంబంధాదులననుసరించీ వారి శారీరక, మానసిక పరిణామాలమీదా అవి ఆధారపడి ఉంటవి. ఇవి తీరనప్పుడే మానవుడు ఉన్మత్తుడవుతాడు. ఈ ఉన్మత్తత రెండువిధాలుగా నివారింపబడుతుంది.

ఒకటి చికిత్స.

రెండవది కళ.

చికిత్సలో జీవితం అజ్ఞాతంగా నాశనమవుతుంది, లేదా మరికొన్ని విచిత్రరోగాలనుకూడా సంక్రమింపజేయవచ్చు, అలానే నాశనంచేసినస్థితులు కూడా ఉన్నాయి. చికిత్సతో ప్రపంచం అంటే భయం, అసహ్యం ఏర్పడతాయి. అందువల్ల చికిత్స అధమవిధానమేగాని ఉత్తమసాధనంమాత్రం కాదు.

ఇంక కళ—

ఇదే నిన్నూ, నన్నూ రక్షించింది.

మనం కొత్తగా కాపురం పెట్టిన రోజుల్లో ఎంతోమంది మన యింటికి విందులకు వచ్చేవారు. అలా వచ్చేవారిలో అనేకులకు సంగీతంలో అభినివేశం ఉండేది, కొందరికి చిత్రకళలో ప్రావీణ్యం ఉండేది, మరికొందరు అభినయంలో నిపుణులు. అసలు ఏదో ఒక కళలో అభినివేశం లేనివారితో నాకు పరిచయమే ఉండేదికాదు.

నువ్వు వీణముందు కూర్చుంటే భారతివే.

ఈ యింటికి నువ్వు వచ్చేవరకూ నీకు వీణావాదనం వచ్చునని నాకు తెలీనే తెలీదు. నీ సామాను సర్దిస్తూండగా మన సుబ్బులు చెప్పింది:

బాబాయ్, మీకు విశ్రాంతి కావలసివచ్చినప్పుడెప్పుడయినా ఆవిడను కబురుచేస్తే వీణ మీటి మీ

హృదయతంత్రీస్పందనంతో శాంతి చేకూరుస్తారు. వీణలో ఆవిడ చాలా బహుమానాలు కూడా సంపాదించారు—అని.

అప్పుడనుకున్నాను ఆనందంతో—నీ జీవితంలో నిన్ను వెన్నంటి ఉండేందుకు ఒక 'దివ్యసహచరి' ఉన్నదని. అప్పుడు నేను పడ్డ తృప్తి...లీలా...

అందుకే ఒక్కోనాడు మధ్యాహ్నం కాఫీకి మేడమీదకు వచ్చి:

'లీలా, ఒక్కసారి హృదయతంత్రీస్పందనం చేస్తావ్?' అని అర్థించేవాణి.

నాలుగైదుసార్లు నువ్వు ఎంతో కుతూహలంతో వీణ తీసేదానివి. నాకు తెలుసు అప్పటి నీ హృదయావేదన. ఆ తరువాయి నీలో అంత ఉండేదికాదు.

కాని లీలా—నా అదృష్టమేకాదు నీ భాగ్యం కూడా. నిజం—వీణ పేరు విన్నంతలో వాలి సోలిపోయే కూతుర్ని కన్న ఉమామహేశ్వరంగారు ఈ ఊరుకి ప్రాక్టీసు మార్చటం, ఆయన చతురంగంలో ప్రవీణుడు కావటంవల్ల మా ఇద్దరిమధ్యా ఆత్మీయత ఏర్పడటం, ఆయన అరవయ్యోపడి దాటినవాడు కూడా అవటంచేత నేను కాస్తంత ఆలస్యంగా వచ్చినా లోపలకు వచ్చి, కూర్చుని, నీతో ఏదో ప్రసంగిస్తూ, కొంత కాలక్షేపంచేసి ఆశీర్వదిస్తూ ఉండటమే కాక ఆయన కూతుర్ని నీదగ్గర వీణాభ్యాసానికి జేర్చటం—ఆ అమ్మాయి పేరు పద్మావతి కాదూ, ఔను—ఆమె సంస్కార, సంప్రదాయాలుకల కుటుంబంలోంచి వచ్చినందువల్ల నీ దగ్గరనుంచి వీణ నేర్చుకుంటూనే, నీకు సంస్కృత, కావ్య, నాటకాలు వినిపిస్తూ వివరించేది ఒకరోజున...

స్త్రీణామశిక్షిత పటుత్వ మమానుషీషు....'

అనే శ్లోకాన్ని ఆ అమ్మాయి వ్యాఖ్యానిస్తూండగా నేను పైకి వచ్చాను. ఆ సమయంలో నీ ముఖం ఎంత మ్లానమయిపోయిందో గుర్తుందా లీలా?

ఆడజాతికి అమానుషపటుత్వం శిక్షానపేక్షితం—

అని పద్మావతి ఎంతచక్కగా బిగించిం...

ఇంతకూ ఎందుకు చెప్పానంటే ఇలాటివన్నీ నీకు కొంతవరకూ కాలాన్ని గమనించకుండా వ్యయం చేసేయటానికీ, నిశ్చింతగా జీవించటానికీ, తీరని మన అవసరాలకు మార్గాంతరాలు కావటానికీ కారణమయాయి.

అయినా అప్పుడప్పుడు నీకు కొంత ఆరోగ్యభంగం కలిగేది. కలిగినా అది విషమించే సావకాశం ఉండేదికాదు. కాకుండా ఉంచేమార్గం నాకు తెలుసు. తెలియటానికి కారణం రోగానికి మూలధాతువు విదితపూర్వం కావటమే.

డాక్టరు వచ్చేవాడు. డాక్టరమ్మలు వచ్చేవారు. ఏదో రోగనిర్ణయం చేసేవారు. ఇంజక్షన్లనేవాళ్ళు—ఎర్రరంగునీళ్లూ, పసుపురంగు సీసాలు వచ్చేవి. ఒక్కసారి నీ చర్మంలోకి సూది దిగనిచ్చేవాణ్ణికాదు, ఆ నీళ్లు నీచేత త్రాగించేవాణ్ణీ కాదుగా? అఖరుకి ఓనాడు డాక్టర్ లలిత నన్నే అడిగింది—నవ్వేసి ఊరుకున్నాను.

జ్వరం తగిలిన మూడోరోజున నేను నీదగ్గర కొన్నిగంటలు ఉల్లాసంగా గడిపేసరికి నీలో ఒక కొత్తకాంతి, నూతనోత్సాహం, ఒక ఆశారేఖ గోచరించేవి. మరునాడు నీకు పథ్యం యిచ్చేయటం జరిగేది. ఇంతవరకూ నేను పొరబడలేదనుకుంటాను?'

అని నవ్వాడు.

లీలాతి విషాదాచ్ఛాదితవదనసీమలో ఒక దరహాసవల్లి అంకురించింది. ఆమె హృదయంలో లేగులాబిరేక గిలిగింతలు పెట్టింది.

"లీలా, మనజీవితంలో సంధ్యారాగాలు ప్రసరిస్తున్నాయి. అస్తమిత సూర్యకాంతులతో నీ—నా ముఖాలు శోభాహీనాలవుతున్నాయి. ఈ సమయంలో ఒక్కసారి మన పూర్వ జీవిత చరిత్రాధ్యాయాలను స్మృతిదృక్కులతో పఠించుకుని ఉపసంహారం వ్రాసుకుందాం.

"ఆఁ లీలా!

ఉమామహేశ్వరంగారు చెప్పేవారు గుర్తుందా?

ఈ ప్రపంచ సర్వస్వానికి హేతుభూతమయినది ఒక్క శబ్దబ్రహ్మమేననీ, ఆ శబ్దం ఆకాశంనుంచి ఉద్భవిస్తుందనీ, దానినే భారతీయ ఋషులు 'ఓమ్'కారంగా భావించారనీ, ఆ శబ్దాన్నే 'ఉద్గీథ' అంటారనీ, ఈ శబ్దంనుంచే సృష్టి, స్థితి, లయ కారులావిర్భవించారనీ, వారిమూలకంగానే ఈ భువన

భవనం, ఈ భవనంలో ఎనభైనాలుగు లక్షల జీవరాసులూ... ఈ పరిణామాలూ ఏర్పడ్డాయనీ...

నువ్వు మరిచిపోవులే....

తదచ్ఛబ్దవాచ్యమయిన చిచ్ఛక్తిరూపాన్నే సర్వకారణంగా వేదాంతులు భావిస్తారని, ఆ భావనలోనే అపరోక్ష బ్రహ్మ సాక్షాత్కారానుభూతి వారికి కలుగుతుందనీ మహేశ్వరంగారు చెప్పినప్పుడు వినే ఉంటావు. ఆ విషయాలు ఆయన చెప్పుకుపోతూంటే ఎంత విశ్వసించదగ్గవిగా కనిపించేవి లీలా—అదంతా ఇప్పుడు చెప్పవలసిన అవసరం ఏమిటని సందేహిస్తావేమో! నిజంగా దాని అవసరం ఉంది.

సృష్టికర్తకీ లయం చేసే బాధ్యతకూడా ఉంది. ఈ రెండింటికీ ఒక్కడే బాధ్యుడు కావటం ప్రాకృతిక నియమం. అదే రీతిగా కన్న సంతానాన్ని పోషించుకొనే అభిలాషతోపాటు హతమార్చే అధికారం కూడా వారికే ప్రసాదించబడింది. ఆ విషయాన్ని అంగీకరించగలవనుకుంటాను?

నువ్వూ—నేనూ అంగీకరించకపోయినా అది జరుగుతూనే ఉంది.

పెద్దపులి పిల్లల్ని కనగానే ఆకలివేడిలో మింగేస్తుంది. పాము గ్రుడ్లను పెడుతూ కళ్ళుమూసుకుని గుటకేస్తుంది. క్రూరజంతుజాలంలోనే కాదు—ఈ నియమం మానవజాతిలోకూడా ఉంది.

కుంతి కర్ణుణ్ణి గంగలో పారేసింది.

గంగ ఏడుగురు కొడుకుల్ని మహాప్రవాహంలో వదిలేసింది.

అంత వెనక్కు పోనక్కర్లేదు. మనయింటికి వచ్చే సోమేశ్వరరావుగారి అమ్మాయి భర్తతో కాపురం చెయ్యనని వచ్చేసిన మూడోయేట పిల్లవాణ్ణి కని హాస్పిటల్ గోడవార పారేసింది, ఎరగవూ?

అందుచేత కన్నవారికే చంపుకునే హక్కు కూడా ఉంది లీలా"

అని చుట్ట ముట్టించాడు రావుసాహెబ్.

లీలావతి దీనవదనం మ్లానమవుతున్నది. ఆమె కన్నులు దృష్టిని కోల్పోతున్నవి. ఆమెగుండె వేగంగా, ఉపద్రవంగా, మందంగా సాగుతున్నది. ఉచ్ఛ్వాస—నిశ్వాసలలో భేదం తెలీటంలేదు.]

"వెళ్ళాను లీలా!

ఉత్తరం వచ్చినమర్నాడే ఆ పట్నానికి వెళ్ళాను. వారంరోజులు ఆ పట్నంలో ఉండి విషయాలన్నీ తెలుసుకున్నాను. అవన్నీ నీకు చెప్పి నిన్నింకా వేధించటం నాకెంతమాత్రం ఇష్టంలేదు. అక్కడ జడ్జీ నా క్లాస్ మేట్. వాడి ఇంటిదగ్గరే బసచేశాను. ఆరోజు రాత్రి భోజనాలయాయి. అతని భార్య నీలానే చదువుకున్నదీ, తెలివయినదీ, ఎంతో నేర్పు కలదీనూ. అంతవరకే.

ఆ రోజు రాత్రి భోజనాలయాయి.

చేతులు తుడుచుకుంటూ వాకిట్లోకి వచ్చేసరికి సోఫాలమధ్య మేజామీద తమలపాకులకు సున్నం రాసి, ఈనెలుతీసి పళ్లెంలో ఉన్నాయి. చుట్టూ సుగంధద్రవ్యాలున్నాయి. ఒకమూలగా కిటికీదగ్గర డ్రాయరుమీద ఏనుగుతొండంలోంచి అగరువత్తుల పొగ బయల్దేరి జాయిగా మామీదకు వస్తూన్నది. ఇద్దరం తమలపాకులు నములుతున్నాం; చుట్టముట్టిస్తూ వాడి ముఖంలోకి చూశాను.

నా గుండె ఝల్లుమంది.

వాడి ముఖంలో నాకు అదోవిధమయిన ఆవేదన ప్రస్ఫుటంగా గోచరించింది. బరువుగా, వేడిగా నిట్టూర్చాడు.

నేను చలించాను.

చలించాను కానీ—చలించినట్లు మూడోకంటికి తెలీదు.

ఏదో విషాదసంఘటన వాడు చెప్పబోతున్నాడనుకున్నాను. జడ్జీకనక ఆ మరునాడో, ఆనాడో ఏదయినా ఉరిశిక్ష విధిస్తున్నాడో, విధించాడో అనుకున్నాను. అయితే అటువంటిదానికి వాడు బాధపడనక్కర్లేదు; అప్పటికే వాడికలం ఎన్ని తలలనో తీయించేసి ఉంటుంది కనక వాడికదేం బాధ కలిగించకూడదు.

'ఏమిటి విశేషం?' అన్నాను.

వాడు అటూ, యిటూ పరకాయించి చూశాడు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ప్రక్కగదుల్లో పిల్లలు నిద్రపోతున్నారు. వంటింట్లో ఆవిడ భోజనం చేస్తున్నది.

అయినా వాడు అక్కడ కూర్చోలేకపోయాడు. మేడమీదకు నడవమన్నాడు. లేచి వాడు అడుగులు వేశాడు. వాడి వెనకాలే నడిచాను.

మేడమీద గదిలో రెండుక్షణాలు కూర్చున్నాం. మానోట్లో చుట్టలు లేకపోతే ఆ గదిలో చైతన్యంగల రెండుప్రాణు లున్నట్లుకూడా తెలుసుకోలేరు.

వాడు లేచాడు—లేచి డ్రాయరు చొరుగు తీసి ఈ కవరు—

నా జేబులో ఉంచాడు.

నేను తియ్యబోయాను.

వాడు నాచేతిని పట్టుకు ఆపేశాడు.

నేనురైలు దిగేవరకూ ఆకవరు విప్పవద్దన్నాడు.

అక్కడనుంచి డాబామీదికి తీసుకువెళ్ళాడు. ఇద్దరం పైకి నడిచాం.

ఎక్కుతూండగానే వాడు డాబామధ్యలో కూలబడ్డాడు. ప్రక్కగా కూర్చోమని సంజ్ఞచేశాడు.

అప్పటికింకా శశాంకుడు ఆకాశంలోకి రాలేదు. రకరకాల నక్షత్రాల కాంతులతో నీలాకాశం నిగనిగలాడుతున్నది.

"చూశావా...ఆకాశంలోని నక్షత్రాలు..." అని ఆగి నిట్టూర్పు:

"దివ్యతేజస్విని దీనవదనంమీద అంకురించిన స్వేదకణాల్లా ఉన్నాయిరా అనంతాకాశంలోని అగణిత తారకాగణాలు...అవి ఎప్పుడూ ఆమె జడలోని మల్లెమొగ్గలలా కనిపించి ఎంతో శాంతిని కలిగించేవి. కాని ఈనాడు...

తప్పదురా వెంకట్రాయుడూ!

సంఘదృష్ట్యా నాకూ — వాడికీ ఏ సంబంధ బాంధవ్యాలూ ఉండకపోవచ్చు; లేకపోయినా నైతికంగా ఆలోచిస్తే వాడు నా కొడుకు. ఆకారంలోనే కాదు కొన్ని అలవాట్లలో కూడా వాడు నాకొడుకు! కానీ...పరిస్థితులు చూడూ.

వాణ్ని రేపు ఉరి తీయటానికి తీర్పివ్వాలి. అలా కాకుండా నేను తప్పించగలను; కలిగినా ప్రయోజనం లేదురా. వాడిని విడుదలచేసినా వాడు దారిలోకి రాడు. మరికొన్ని ఘోరాలు చేస్తాడు వాడిజీవితం ఇంక బాగుపడదు. వాడికి అనునయం మృత్యుదేవత కౌగిలిలోనే...

ఎంతోసేపు అడిగాను, నీతండ్రి ఎవరని?

వాడు తండ్రిపేరు అడిగేసరికి ఉగ్రుడై దూషిస్తాడేకాని పేరు చెప్పాడుకాదు. తన తల్లినిగురించి, తల్లి ఘనతనుగురించీ చెప్పాడేకాని తండ్రి విషయం చెప్పలేదు. తల్లినిగురించి అంత చెప్పాకకూడా తెలిసికోలేనంతటి మూర్ఖుణ్ని కాదుగా...

వాడి ప్రతిదూషణా నా గుండెలో గుండుసూదిలా మెదులుతూనే ఉంది. వాడి అధోగతికి నేనే బాధ్యుణ్ణని నమ్మక తప్పలేదు. కాలేజీలో చదివే రోజుల్లో ఇంతదూరం ఆలోచించగలమా? ఆ వేడిలో .. .."

అంటూ వాడు తలవాల్చేసి ఒక గంటసేపు ఏడ్చి ఉంటాడు. వాడి దుఃఖం నా గుండెను చీల్చేసింది.

పుత్రగాత్రపరిష్వంగసుఖాన్ని సన్నయభట్టారకులు వర్ణిస్తే, ఆ అక్షరాలకు రూపాన్ని చూపించాడు వాడు. నిజంగా కన్నతండ్రి హృదయావేదన ఈగొడ్డు వాడికేం అర్థమవుతుంది లీలా?

అయినా వాడివేదన నాకు ఆ దుఃఖాన్ని వివరిస్తూ, నా హృదయాన్ని మెలిద్రిప్పేసింది లీలా.

ఆ మరునాటింక నేను ఆగలేకపోయాను.

నాకు వాడిచ్చిన కవరుమాట గుర్తేలేదు.

బెజవాడస్టేషన్లో బట్టలు మారుస్తుండగా జేబులోంచి బైటకి వచ్చింది.

ఎంతో ఆతురతతో విప్పి చూశాను.

అది నేను భావించినట్టు ఉత్తరం కాకపోగా, కొన్ని ఉత్తరాలకట్టతో పాటు ఒక ఫోటో...అన్నీ చదివాను...అందులో వాడూ — ఆ అబ్బాయి తల్లీ ఉన్నారు. ఇదిగో ఈ ఉత్తరాలూ, ఫోటో నీవి:

"ఇప్పుడు చెప్పు లీలా!

వాడు నీ కొడుకో?

మన కొడుకో?"

అని రావు సాహెబ్ వెంకట్రాయుడు చొదరి చుట్ట విసిరేశాడు.